

ప్రగతి బాటలో నడిపిస్తాం

దీపావళి వేళ ఉచిత గ్యాస్ సంతోషకరం

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

జిల్లా వ్యాప్తంగా ఉచిత సిలిండర్ల పంపిణీ


ఉరవకొండలో ఇంటి వద్దకే వెళ్లి లబ్ధిదారుకు గ్యాస్ సిలిండర్ అందజేస్తున్న కలెక్టర్

ఉరవకొండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాను ప్రగతి బాటలో నడిపేందు కు చిత్తశుద్ధితో పనిచేస్తా మని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో దీపం-2 పథకాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. చౌడేశ్వరీ కాలనీలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి సిలిండర్లను అందజేశారు. దీపావళి సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఉచిత గ్యాస్ పథకాన్ని అమలుచేయడం సంతోషకరమని అన్నారు. ఈ పథకానికి జిల్లాలో 1,85,246 మంది అర్హులని తెలిపారు. బియ్యం కార్డు ఉన్నవారికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. సమస్యలుంటే 1967 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చునని అన్నారు. ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ప్రతి సోమవారం ఫిర్యాదు చేయవచ్చని, సచివాలయంలో ఆర్టీజీఎస్ పోర్టల్‌లో నమోదు చేసినా సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. కొత్త రేషన్ కార్డుల వివరాలను ఆర్డీవోలు, తహసీల్దార్లు సిద్ధం చేయాలని సూచించారు. సంక్షేమ పథకాల అమలులోనూ జిల్లా టాప్-3లో ఉండాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేక అధికారి కుష్బూ కొఠారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు వరం: గుమ్మనూరు


ఉచిత గ్యాస్ సిలిండరును అందజేస్తున్న ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు: పేద, మధ్య తరగతి ప్రజలకు దీపం-2 పథకం వరమని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. పాత గుంతకల్లులోని బీరప్ప దేవాలయ కళ్యాణ మండపంలో డీఎల్‌డీఓ విజయలక్ష్మి అధ్యక్షతన లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని అన్నారు. ఉచిత గ్యాస్ వల్ల ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.2,670 లబ్ధి చేకూరుతుందని అన్నారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులకు పింఛన్ పంపిణీ చేశారు.

అర్హులందరికీ ఇస్తాం: కాలవ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం టౌన్: అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని 17వ వార్డులో ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. కూటమి అధికారం చేపట్టి ఆరు నెలలు గడవకనే ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు ఉచిత గ్యాస్ పథకాన్ని ప్రారంభిచారని తెలిపారు. రాయదుర్గం నియోజక వర్గంలో 40,171 మంది లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు.

చంద్రబాబు చలువే: పరిటాల సునీత


గ్యాస్‌సిలిండర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి: దీపం పథకం తెచ్చింది, ఇప్పుడు ఉచిత గ్యాస్ సిలిండర్‌లు అందిస్తున్నది చంద్రబాబు నాయుడే అని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరిలో ఉచిత గ్యాస్ సిలిండర్లను ఆమె పంపిణీ చేశారు. సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్‌లు అందిస్తున్నామని అన్నారు. కట్టెల పొయ్యితో మహిళలు పడుతున్న కష్టాలు చూసి దీపం పథకాన్ని చంద్రన్న తెచ్చారని అన్నారు. గ్యాస్ బుకింగ్ చేసుకున్న 48 గంటల్లో లబ్ధిదారుల ఖాతాకు నేరుగా డబ్బు జమ అవుతుందని అన్నారు. ప్రభుత్వంలో రేషన్‌కార్డులు తొలగించడం వల్ల ఎంతో మంది టీడీపీ, బీజేపీ, జనసేన సానుభూతిపరులకు పథకాలు అందలేదని అన్నారు. దీని వల్ల పింఛన్, గ్యాస్‌సిలిండర్‌లు అందకుండా పోతున్నాయని అన్నారు.

దార్శనికుడు పటేల్: కలెక్టర్


సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, నవంబరు 1: ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ గొప్ప దార్శనికుడని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ కొనియాడారు. పటేల్ జయంతి వేడుకలను కలెక్టరేట్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి కలెక్టర్, ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ సమగ్రత కోసం పటేల్ చేసిన కృషి ఎనలేనిదని, ఆయనను యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. స్వతంత్ర భారతదేశానికి తొలి హోంమంత్రిగా, ఉప ప్రధానిగా ఆయన సేవలు అందించారని అన్నారు. ప్రజలందరూ ఐకమత్యంతో సాగితే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో డీపీఎం ఆనంద్, కలెక్టరేట్ అధికారులు యుగేశ్వరి, రియాజుద్దీన్, వసంతలత, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

కర్పూరం పరిశ్రమలో ప్రమాదం

రియాక్టర్ నుంచి విషవాయువులు

ఆరుగురు కార్మికులకు తీవ్ర అస్వస్థత

ఇద్దరి పరిస్థితి విషమం

మరమ్మతులు చేస్తుండగా ఘటన


చికిత్స పొందుతున్న కార్మికులు హరి, కృష్ణ, లక్ష్మణరావు, నాగేంద్ర ప్రసాద్, శివరాం ప్రసాద్

శింగనమల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపల్లి వద్ద ఉన్న సప్తగిరి క్యాంపర్ పరిశ్రమలో ఆర్-3 రియాక్టర్‌కు మరమ్మతులు చేస్తుండగా విష వాయువులు వెలువడ్డాయి. వెల్డింగ్ చేస్తున్న సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగిందని సమాచారం. రియాక్టర్ నుంచి వెలువడిన ఐసోబ్రొనైల్ అసిటేట్ వాయువును పీల్చిన ఆరుగురు కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బాధితులు కేకలు వేయడంతో అక్కడున్న సిబ్బంది వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం వారిని అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితులలో పామిడికి చెందిన కృష్ణ, వడియంపేటకు చెందిన హరి, శ్రీకాకుళం జిల్లాకు చెందిన లక్ష్మణరావు, అనంతపురం నగరానికి చెందిన ఓబులేసు, నాగేంద్ర ప్రసాద్, శివరాం ప్రాసాద్ ఉన్నారు.


ఆసుపత్రిలో కుటుంబసభ్యులు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

షార్ట్ సర్క్యూట్‌తోనే..?

ఆరుగురు కార్మికులు ఎప్పటిలాగో శుక్రవారం విధులకు వెళ్లారు. కర్పూరం తయారు చేసే ఆర్-3 వద్ద వీరు వారం రోజులుగా మరమ్మతులు పనులు చేస్తున్నారు. ప్రతి పది రోజులకు ఒకసారి ఈ రియాకర్టర్‌ను శుభ్రం చేయాల్సి ఉంటుంది. దీనికి రంధ్రాలు పడటంతో వెల్డింగ్ పనులు చేస్తున్నారు. ఆ సమయంలో ఆక్సిజన్ సహా అన్ని భద్రతా ప్రమాణాలను కార్మికులు పాటించారని ఫ్యాక్టరీ నిర్వాహకులు చెబుతున్నారు. ఒక్కసారిగా రియాక్టర్ నుంచి వాయువులు వెలువడటంతో కార్మికులు ఊపిరి అందక తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బాధితులలో లక్ష్మణ్‌రావు, నాగేంద్ర ప్రసాద్ పరిస్థితి విషమంగా ఉంది. వారికి ఐసీయూలో వెంటిలేషన్‌పై చికిత్స అందిస్తున్నారు. సీఐ కౌలుట్లయ్య సిబ్బందితో ఫ్యాక్టరీని సందర్శించారు. నిర్వాహకులతో మాట్లాడి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు.

యాజమాన్యం తీరుపై విమర్శలు

ఫ్యాక్టరీలో ఉదయం ప్రమాదం జరిగితే మధ్యాహ్నం వరకూ తమకు సమాచారం ఇవ్వలేదని కార్మికుల కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమవారికి ఏదైనా జరిగితే తమ పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, రియాక్టర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ ప్రమాదం జరిగదని ఫ్యాక్టరీ నిర్వాహకులు, పోలీసులు అంటున్నారు. కర్నూలులోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఈ ప్రమాదం గురించి ఆరా తీశారు.

మెరుగైన వైద్యం అందించండి: ఎమ్మెల్యే శ్రావణి

కర్పూరం తయారీ ఫ్యాక్టరీలో ప్రమాదం బాధాకరమని ఎమ్మెల్యే బండారు శ్రావణి అన్నారు. బాధితులను హైదరాబాద్ లేదా బెంగూరులోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు తరలించి మెరుగైన వైద్యం అందించాలని ఆమె సూచించారు. కార్మికులకు ప్రభుత్వం పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రమాదానికి ఫ్యాక్టరీ యాజమాన్యం బాధ్యత వహించాలని, కార్మికుల కుటుంబాలకు అండగా నిలవాలని అన్నారు.


నగరంలో టపాసులు కాలుస్తూ దీపావళి సంబరాలు చేసుకుంటున్న ప్రజలు

వైభవంగా దీపావళి సంబరాలు

అనంతపురం కల్చరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దీపావళి వేడుకలను జిల్లా ప్రజలు గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఆలయాలు, ఇళ్లు, పరిసరాలలో మట్టి ప్రమిదల కాంతులు పరుచుకున్నాయి. మధ్య రాత్రివరకూ బాణ సంచా పేలుళ్లు కొనసాగాయి. చిక్కటి చీకటి పరుచుకున్న ఆకాశంలోకి వెలుగులు విరజిమ్ముతూ తారాజువ్వలు దూసుకెళ్లాయి. ఆలయాలతో సందడి కనిపించింది. ఇళ్లు, వ్యాపార సముదాయాల్లో మహాలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతపురం మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో కేదారేశ్వరస్వామి వ్రతాన్ని ఆచరించారు.

వెలుగుల సంబరం

ఘనంగా దీపావళి వేడుకలు

చివరి పింఛన్


పింఛన్ అందిస్తున్న సచివాలయ ఉద్యోగి గాయత్రి

బొమ్మనహాళ్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కళ్లదేవనహళ్లిలో దేవిరెడ్డి రుద్రమ్మ(70) అనే వృద్ధురాలు శుక్రవారం పింఛన్ తీసుకున్న గంట తరువాత మృతిచెందారు. ఆమె కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ, బళ్లారిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న సచివాలయ ఉద్యోగి గాయత్రి బళ్లారికి వెళ్లి ఆసుపత్రిలో ఆమెకు మధ్యాహ్నం 3 గంటల సమయంలో పింఛన్ రూ.4 వేలు అందజేశారు. ఆ తరువాత గంటకే రుద్రమ్మ మృతిచెందారు.

పింఛన్ల పంపిణీలో రెండోస్థానం

తొలిరోజు 96.21 శాతం పూర్తి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను తొలి రోజే 96.21 శాతం పంపిణీ చేసి.. జిల్లా రాష్ట్రంలో రెండోస్థానంలో నిలిచింది. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది శుక్రవారం ఉదయం నుంచే ఇళ్ల వద్దకు లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందజేశారు. కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీలో పింఛన్ మానిటరింగ్ విభాగం నుంచి డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య పర్యవేక్షించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు సర్వర్ మొరాయించింది. దీంతో పింఛన్ పంపిణీ ఆలస్యమైంది.

కలెక్టరేట్‌లో పేలిన రైఫిల్

ఏఆర్ హెచ్‌సీకి గాయాలు

4

సమగ్ర శిక్ష

కీలక పోస్టులన్నీ ఖాళీ

భర్తీ కోసం నెల క్రితం ఇంటర్వ్యూలు

ఫైల్‌ను అటకెక్కించిన అధికారులు

ఉన్నవారిపై పని భారం.. ఒత్తిడి


సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయం

అనంతపురం విద్య, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో సమగ్రశిక్ష ప్రాజెక్టు అత్యంత ప్రధానమైనది. చదువులకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, ఉపాధ్యాయులకు శిక్షణ, పుస్తకాలు, ఇతర సామగ్రి పాఠశాలలకు చేరవేత, పథకాల అమలు గురించి ప్రభుత్వాలకు నివేదికలు, గణాంకాల సమర్పణ.. ఇలా నిత్యం కార్యక్రమాలు కొనసాగుతుంటాయి. వీటిని నిరంతరం పర్యవేక్షించాల్సిన సమగ్రశిక్షలో కీలక పోస్టులన్నీ ఖాళీ అయ్యాయి. భర్తీ చేసేందుకు అధికారులు నెల క్రితం శ్రీకారం చుట్టారు. అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి.. పరిశీలించారు. అనంతరం ఇంటర్వ్యూలు చేశారు. కానీ ఇంత వరకూ భర్తీ చేయలేదు. దీంతో ఇంటర్వ్యూలు పూర్తి చేసుకున్నవారు ఇస్తారా.. ఇవ్వరా అనే అయోమయం పడ్డారు. ఉన్నవారు వెళ్లిపోవడం, కొత్తవారు రాకపోవడంతో ప్రాజెక్టు పనులు నత్త నడక సాగుతున్నాయి. మిగిలినవారిపై పనిభారం, తీవ్ర ఒత్తిడి పడుతోంది. నిర్ణయం తీసుకోవాల్సిన కలెక్టరేట్ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

ఏం జరుగుతోంది..?

సమగ్ర శిక్ష ప్రాజెక్టులో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారుల ఎంపిక కోసం అక్టోబరు 1న ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఖాళీ పోస్టులకు సుమారు 35 మంది దరఖాస్తు చేశారు. వివిధ పోస్టులకు వీరి నుంచి 110కిపైగా దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారులలో 14 మందిని ఇంటర్వ్యూకు పిలవగా 13 మంది హాజరయ్యారు. అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ఏపీసీ నాగరాజు, డైట్ ప్రిన్సిపాల్ రవిసాగర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ తంతు ముగిసి నెల గడిచినా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇన్ని రోజులపాటు ఏం చేస్తున్నారో అని ఇంటర్వ్యూలు ఎదుర్కొన్న ఉపాధ్యాయులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు ఉన్నతాధికారులు సైతం దీనిపై నోరుమెదపడం లేదు. ఎమ్మెల్యేలు, రాజకీయ పెద్దల ప్రమేయంతో బ్రేక్ పడిందా...? లేక వేరే కారణాలున్నాయా అనే సందేహాలు తలెత్తుతున్నాయి.

మూడు నెలలుగా తిప్పలు

సమగ్ర శిక్షలో మూడు నెలలుగా అధికారులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులైన ఏఎంఓ, జీసీడీఓ, ఇద్దరు అసిస్టెంట్ ఏఎంఓలు, అసిస్టెంట్ సీఎంఓ, అసిస్టెంట్ అలెస్కో, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్, అసిస్టెంట్ ఐఈడీని విద్యాశాఖకు రీ ప్యాట్రియేషన్ చేశారు. ఈ పోస్టులన్నీ అత్యంత కీలకమైనవి. రీప్యాట్రియేషన్ చేసినవారిలో ఇద్దరిని మాత్రం కొత్తవారు వచ్చే వరకూ ప్రాజెక్టులోనే ఉంచుకుని, తాత్కాలికంగా పని చేయించుకుంటున్నారు. మిగిలినవారిని పంపించేశారు. కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉండటంతో సమగ్రశిక్షలో పాలన కుంటుపడుతోంది. ఒక వైపు ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణలు జరుగుతున్నాయి. అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి వచ్చే టీచర్లకు ఇస్తున్న ఈ శిక్షణా కార్యక్రమాలను, ఏర్పాట్లను సమగ్రశిక్ష అధికారులే పర్యవేక్షించాలి. మరో వైపు కేజీబీవీల పోస్టుల భర్తీ సైతం కొనసాగుతోంది. రొటీన్ వర్క్‌లకు అదనంగా ఈ పనులు ఉండటంతో ప్రాజెక్టు ఉద్యోగులపై భారం పడుతోంది. ప్రాజెక్టు ఉన్నతాధికారులతోపాటు సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

విషజ్వరంతో చిన్నారి మృతి



ఆరాధ్య (ఫైల్)

ఉరవకొండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివరా మిరెడ్డి కాలనీకి చెందిన ఆరాధ్య(7) అనే చిన్నారి విషజ్వరంతో మృతి చెందింది. ఆ కాలనీకి చెందిన మారుతి, మహేశ్వరి దంపతుల కుమార్తె ఆరాధ్యకు వారం రోజుల క్రితం జ్వరం వచ్చింది. స్థానిక ఆసుపత్రిలో చూపించినా జ్వరం తగ్గకపోవడంతో నాలుగు రోజుల క్రితం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. బెంగళూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. చిన్నారి వైద్యం కోసం రూ.6 లక్షల దాకా ఖర్చు చేసినట్లు తల్లిదండ్రులు తెలిపారు. చిన్నారి మృతితో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

పశుసంవర్ధక శాఖ విశ్రాంత జేడీపై చర్యలు

ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ నిలిపివేత

అనంతపురం అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖ విశ్రాంత జేడీ సుబ్రహ్మణ్యం పదవీ విరమణ బెనిఫిట్స్‌ను నిలిపివేస్తూ ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2020-21లో ఆయన డీడీ హోదాలో ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్‌గా పనిచేశారు. ఆ సమయంలో జిల్లాలోని మూడు ప్రాథమిక సహకార సంఘాలకు సరఫరా చేసిన ఎరువుల బకాయిలు ఉండటంతో పదవీ విరమణ బెనిఫిట్స్‌ను ఆపేశారు. ఆయా సంస్థల నుంచి బకాయిలు వచ్చే దాకా బెనిఫిట్స్ ఇవ్వరు. విడపకల్లు మండలం కొట్టాలపల్లి ప్రాథమిక సహకార సంఘాలనికి సరఫరా చేసిన ఎరువుల్లో ప్రస్తుతం రూ.23 లక్షలు బకాయి ఉంది. వజ్రకరూరు మండలం పొట్టిపాడుకు చెందిన మన వజ్రకరూరు ఎఫ్‌పీఓకు రూ.16 లక్షల విలువైన ఎరువులు స్వరఫరా చేయగా ప్రస్తుతం రూ.3.50 లక్షలు బకాయి ఉంది. గుమ్మగట్ట ఎఫ్ఎస్‌సీఎస్ రూ.1.20 లక్షలు బకాయి ప డింది. ఈ నేపథ్యంలోనే బకాయిలకు సం బంధించిన నోటీసులును ఆయనకు ఏపీ మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు పంపినట్లు స మాచారం. ఆయన నుంచి సమాధానం రాక పోవడంతో పశుసంవర్ధక శాఖ రాష్ట్ర ఉ న్నతాధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆయన పదవీ విరమణ బెనిఫిట్స్‌ను ఆపేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు ఎంపిక



అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గుంతకల్లు టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలకు చెందిన బీకాం కంప్యూటర్ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఇందు ప్రీ రిపబ్లిక్ పరేడ్ క్యాంపునకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ తెలిపారు. కళాశాలలో శుక్రవారం విద్యార్థినిని అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 12నుంచి 21 వరకు మహారాష్ట్రలోని జాల్గావ్‌లో నిర్వహించే ప్రీ రిపబ్లిక్ పరేడ్ క్యాంపునకు ఇందు ఎంపికైందని తెలిపారు. ఢిల్లీలో జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే పెరేడ్ క్యాంపునకు కూడా ఆమె ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

అనంతపురం విద్య, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్న సంస్థలు, వ్యక్తులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని బాలల సంక్షేమ సంఘం జిల్లా పర్యవేక్షణాధికారి ఫారూక్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి లేదా రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు పొందడం ద్వారా లేదా ప్రభుత్వ నిధులు పొందకుండా గానీ నడుపుతున్న బాలల సంరక్షణ కేంద్రాలన్నీ జువైనల్ జస్టిస్ చట్టం- 2015 సెక్షన్ 41 మేరకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్, చిరునామా, అర్హతలు, జతపరచాలని, డాక్యుమెంట్లు చెక్‌లిస్టు మొదలైన వివరాలన్నీ http ://wdcw.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే...ఏడాది జైలు శిక్ష లేదా లక్ష రూపాయల జరిమానా విధిస్తారని హెచ్చరించారు.

7న కమిషనర్ కార్యాలయంలో సమావేశం

అనంతపురం న్యూటౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కమిటీ అసెట్స్ గ్రామ పంచాయతీ నిర్మాణంలో చేపట్టే అభివృద్ధి పనులపై 7వ తేదీన కమిషనర్ కార్యాలయంలో జడ్పీ సీఈఓ, డీపీఓలకు సమీక్ష నిర్వహిస్తున్నట్లు డీపీఓ నాగరాజనాయుడు తెలిపారు. ఏఏ అభివృద్ధి పనులు చేపట్టాలన్నది ఇప్పటికే నిర్ణయించామన్నారు. పైప్‌లైన్, బస్‌షెల్టర్ ఏర్పాటు, ఓఎల్ఎస్ఆర్ మరమ్మతులకు సంబంధించి 2024-25 మార్చి చివరికి వీటన్నింటినీ పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపైనా చర్చిస్తామన్నారు.

ఎప్పుడూ ఆ తుపాకీలే మిస్‌ఫైర్

- వేధింపులు.. ఒత్తిళ్లే కారణమా..?
- గతంలోనూ ఘటనలు..

ఏఆర్ సిబ్బంది బలవన్మరణాలు

అనంతపురం క్రైం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్‌లో మిస్‌ఫైర్ కలకలం రేపింది. ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ సుబ్బరాజు శుక్రవారం తెల్లవారుజామున విధుల్లోకి వెళ్లారు. ఈ క్రమంలోనే తన వద్దనున్న 303 రైఫిల్‌ను క్లీన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు పేలడంతో ఛాతి పక్క నుంచి బుల్లెట్ అవతలి వైపునకు దూసుకెళ్లింది. విషయం తెలియగానే జిల్లా ఎస్పీ జగదీష్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న సుబ్బరాజును పరామర్శించారు. మెగ్జిన్ ఎందుకు తీయలేదని ప్రశ్నించగా...పొరపాటున జరిగిపోయిందని చెప్పినట్లు తెలిసింది. సుబ్బరాజు గత కొంతకాలంగా ట్రెజరీలో గార్డుగా పని చేస్తున్నారు. గతంలో విధుల్లో నిర్లక్ష్యం కారణంగా రెండుసార్లు సస్పెండ్ అయ్యారు. కొంత వరకు అప్పులున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆత్మహత్యకు ప్రయత్నించే క్రమంలో అలా జరిగిందా...?లేక పొరపాటుగా క్లీన్ చేసే సమయంలో మిస్‌ఫైర్ అయిందా..?అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. బుల్లెట్ రౌండ్స్‌లోడ్ ఉన్న మెగ్జిన్ తీశాకే అందరూ గన్ క్లీన్ చేసుకుంటారు. మరి సుబ్బరాజు ఆ సమయంలో మెగ్జిన్ తీయకుండానే ఎందుకు క్లీన్ చేశాడనేది అంతుబట్టడం లేదు. మిస్‌ఫైర్ల వెనుక అసలు నిజాలు వేరే ఉన్నాయనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

మితిమీరిన ఒత్తిళ్లు

ఏఆర్ సిబ్బందిపై ఒత్తిళ్ల కారణంగానే ఆత్మహత్యలు, మిస్‌ఫైర్‌లు జరుగుతున్నాయని తెలుస్తోంది. కొందరు అధికారులు డబ్బు కోసం డిమాండ్ చేయడం కూడా వారిపై ఒత్తిడి పనిచేసినట్లు సమాచారం. వారు అడిగిన చోట డ్యూటీలు వేయకపోవడం కూడా ఇందుకు కారణమవుతున్నట్లు తెలుస్తోంది. నెలల తరబడి ఒకే చోట ఉంచటం కూడా ఒత్తిళ్లకు కారణమవుతున్నట్లు ఏఆర్ విభాగం పోలీసులు వాపోతున్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుబ్బరాజు, తుపాకీ పేలినచోట ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

గతంలోనూ మిస్ ఫైర్లు...

గతంలోనూ మిస్‌ఫైర్లు అనేకసార్లు జరిగాయి. అత్యధిక శాతం ఏఆర్ విభాగంలోనే జరగడం గమనార్హం. వాటిలో కొన్ని..

- 2008లో డీఐజీ బంగ్లాలో డీఐజీ గన్‌మ్యాన్ గోపాల్ పిస్టల్ పేలడంతో మృతి చెందారు. మిస్ ఫైరా ...లేక ఆత్మహత్య అనే విషయంలో పోలీసులు స్పష్టత ఇవ్వలేకపోయారు.
- 2009లో మన్నీల సమీపంలోని ఫైరింగ్ రేంజ్‌లో అప్పటి అడ్మిన్ ఆర్ఐ శేఖర్ సిబ్బందికి ఫైరింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఆ సందర్భంలో ఆ ఆర్ఐ ఇంటర్ చదువుతున్న తన కొడుకును తీసుకెళ్లాడు. ఆ అబ్బాయి ఓ రైఫిల్‌ను ట్రై చేశాడు. దీంతో సమీపంలో ఉన్న సుంకన్న ఛాతిలోకి బుల్లెట్ దూసుకెళ్లింది. దీంతో అతను 8 ఏళ్ల ఆసుపత్రిలో, ఏడాది కోమాలో ఉండి బయటపడ్డాడు. ఆ ఘటనపై అప్పటి ఇటుకలపల్లి పోలీసులు కేసు కూడా నమోదు చేయకపోవడం గమనార్హం.
- 2011లో జూనియర్ కళాశాలలో ప్రశ్నపత్రాలకు సంబంధించి సెక్యూరిటీ కోసం పేపర్ గార్డ్‌గా ఉన్న ఇస్మాయిల్ విషయంలోనూ మరో ఘటన చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఉన్న ఇస్మాయిల్ తనను తాను కాల్చుకుని మృతి చెందారు. ఎంటీ సెక్షన్‌లో ఉండే తాను హెడ్‌కానిస్టేబుల్‌గా ఉంటూ గార్డు డ్యూటీ వరుసగా మూడు నెలలు వేయడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నారు.
- 2014లో కలెక్టరేట్‌లోని ట్రెజరీ కార్యాలయంలో ఓ హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందారు. దాదాపు 28 ఏళ్ల తరువాత డ్యూటీకి వచ్చిన ఆయన మిస్‌ఫైర్ కావడంతో మృతి చెందారు.
- 2016లో పాత డీపీఓ ఆఫీస్‌లో మరోసారి మిస్ ఫైర్ అయింది. డ్యూటీకి వెళ్లిన సమయంలో ఓ కానిస్టేబుల్ లోడ్ చేసుకుని, రౌండ్స్ తీసుకెళ్లారు. తిరిగి గన్ ఇచ్చే సమయంలో వాటిని తీయలేదు. చెక్ చేసే సమయంలో మిస్ ఫైర్ అయి గోడకు తగిలింది. పాతది కావడంతో అది కొంత చీలిపోయింది.
- 2022లో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏఆర్ పోలీస్ సిబ్బంది స్వాతంత్ర్య దినోత్సవానికి డెమో నిర్వహించారు. ఈ సమయంలో ఓ కానిస్టేబుల్‌కు రబ్బరు బుల్లెట్ తగలడంతో కాలికి గాయమైంది.

కలెక్టరేట్‌లో పేలిన రైఫిల్

ఏఆర్ హెచ్‌సీకి గాయం

అనంతపురం కలెక్టరేట్‌లో గన్ మిస్ ఫైర్ అయింది. ఏఆర్ హెడ్ కా నిస్టేబుల్ సుబ్బరాజు ఛాతీ పక్క నుంచి బుల్లెట్ దూ సుకువెళ్లింది. ఆయనకు తీవ్ర గాయమైనా.. ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున 4.45 గంటలకు చోటుచేసుకుంది. కలెక్టర్‌లోని ట్రెజరీ గార్డుగా ప నిచేస్తున్న సుబ్బరాజు శుక్రవారం తెల్లవారుజామున విధుల్లోకి వెళ్లారు. ఈ క్రమంలోనే తన వద్దనున్న 303 రైఫిల్‌ను క్లీన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు పేలింది. ఛాతి పక్క నుంచి బుల్లెట్ అవతలి వైపుకు దూసుకెళ్లింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో సుబ్బరాజే తన సోదరుడికి ఫోన్ చేసి సమాచారం అందించాడు. అతడు వచ్చి హుటాహుటిన అనంతపురం సర్వజన వైద్యశాలకు తరలించాడు. వైద్యులు సర్జరీ చేసి ప్రాణాపాయం లేదని తెలియజేశారు. ఎస్పీ జగదీష్ సుబ్బరాజును పరామర్శించారు. ఘటనపై ఆరా తీశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు గతంలో సుబ్బరాజును రెండుసార్లు సస్పెండ్ చేశారు. అప్పులు ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది. ఈ క్రమంలో ఆత్మహత్యకు ప్రయత్నం చేశారేమో అన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.

మహిళలకు ఉచితంగా వంటగ్యాస్

- కూటమి హామీ అమలు • జిల్లాలో 28వేల మంది బుకింగ్ • అట్టహాసంగా పంపిణీకి శ్రీకారం

అనంతపురం టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కూటమి తరఫున టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు మహిళలకు ఏడాదికి మూడు ఉచితంగా వంటగ్యాస్ సిలిండర్లను అందజేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు దీపావళి పండుగను పురస్కరించుకొని కూటమి ప్రభుత్వం అమలుకు అడుగులు వేసింది. ఇందులో భాగంగా అక్టోబరు 29వ తేదీ నుంచి బుకింగ్ చేసుకుని అర్హులందరికీ తొలిసారిగా గ్యాస్ సిలిండర్ల పంపిణీకి నిర్ణయం తీసుకుంది. జిల్లాలో అధికారిక లెక్కల మేరకు 28వేల మంది ఉచితగ్యాస్ కోసం బుకింగ్ చేసుకున్నారు. వీరందరికీ శుక్రవారం నుంచి ఉచితంగా సిలిండర్లు పంపిణీకి శ్రీకారం చట్టారు. అనంత జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లోను ప్రజాప్రతినిధులు, అధికారులు ఉచితగ్యాస్ సిలిండర్ల పంపిణీని అట్టహాసంగా చేపట్టారు. ఉరవకొండలో కలెక్టర్ వినోద్ కుమార్ చేతులు మీదుగా సిలిండర్లను మహిళలకు అందజేశారు. అనేక ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం పాల్గొని ఉచిత గ్యాస్ పంపిణీని కొనసాగించారు. బుకింగ్ చేసుకొని సిలిండర్ పొందిన మహిళలకు తిరిగి ఆ సొమ్ము 48 గంటల్లో వారి ఖాతాల్లోకి జమ అవుతుందని డీఎస్ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. తొలివిడత బుకింగ్‌కు మార్చి 31వరకు బుకింగ్‌చేసుకొని ఉచిత గ్యాస్ సిలిండర్ పొందవచ్చన్నారు. అవసరం ఉన్నపుడు మాత్రమే బుక్ చేసుకున్నా సిలిండర్‌ను ఇంటివద్దకే తెచ్చి ఇస్తారన్నారు.



మహిళలకు సిలిండర్లను అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పరమ పవిత్రం కార్తీకం

ఆలయాలు ముస్తాబు

నేటి నుంచి ప్రత్యేక పూజలు

అనంతపురం కల్చరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆశ్వీయుజ మాసం శుక్రవారం నాటికి ముగిసింది. సూర్యమానాన్ని అనుసరించి శనివారం నుంచి కార్తీక మాసం ప్రారంభం కానుంది. పూర్ణిమ కృత్తికా నక్షత్రంతో కూడి ఉన్నందున ఈ మాసానికి కార్తీకమాసమని పేరు. పరమశివుడు, శ్రీమహావిష్ణువులకు అత్యంత ప్రీతిపాత్రమైనది ఈ మాసం. అందుకే శివాలయాల్లో అభిషేకాలే కాక విష్ణు ప్రీతిగా తులసిపూజలూ నిర్వహించడం ఆనవాయితీ. కార్తీక మాసంలో తెల్లవారుజామునే లేచి తలారా స్నానం చేసి, శుభ్రమైన దుస్తులు ధరించి, తులసికోట ముందు భగవన్నామ సంకీర్తన చేస్తూ ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తారు. కార్తీకమాసంలోనే శీతాకాలమూ ఆరంభమవుతుంది. నదీ, సముద్ర జలాల్లో దేహానికి అవసరమైన లవణాలు నిక్షిప్తమై ఉంటాయి. కనుక కార్తీకమాసంలో సూర్యోదయానికి ముందే స్నానాదులు ఆచరిస్తే రోగాలు దరిచేరవని శాస్త్రం చెబుతోంది.

ఆలయాలు ముస్తాబు..

కార్తీకమాస పూజలకు జిల్లా వ్యాప్తంగా ఆలయాలన్నీ సిద్ధమయ్యాయి. రోజూ పరమేశ్వరుడికి విశేష పూజలు, అభిషేకాలు, మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతపురం మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం, ఆరో రోడ్డు సర్వేశ్వరాలయం, హెచ్చెల్సీ కాలనీ మంజునాథస్వామి దేవాలయం, చాముండేశ్వరి దేవాలయం, శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠం, శివబాలయోగి ఆశ్రమం, బెంగుళూరురోడ్డులోని శివకోటి దేవాలయం, పాతూరులోని విరూపాక్షేశ్వరాలయం తదితర ఆలయాలు కార్తీక మాస పూజలకు ముస్తాబయ్యాయి.



మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

ఎన్నో ప్రయోజనాలు



కార్తీకమాసంలో ఆచరించే చన్నీటి స్నానంతో పాటు భక్తిప్రపత్తులతో నిర్వహించే పూజాదులవల్ల మానసికంగానే కాక శారీరకంగానూ అనేక ప్రయోజనాలున్నాయి. దేవుడిపై గల భక్తిని మనసునిండా నింపుకుని వేకువజామునే చేసే చన్నీటి స్నానం వల్ల శారీరకోల్లాసం కలుగుతుంది. మానసికంగానూ ఎంతో దృఢంగా ఉండగలం. ఈ మాసంలో చేసే దీపారాధన ఏడాది మొత్తం చేసే దీపారాధనలతో సమానం. ఏడాది మొత్తం చేసే పూజాఫలం ఈ మాసంలో ఒక్కటే లభిస్తుందని పురాణాల సారాంశం.

- నరసింహశాస్త్రి, పురోహితుడు, అనంతపురం

నేడు డీలర్ల సంఘానికి ఎన్నికలు

మూడు పదవులకు పోటీ

అభ్యర్థుల ముమ్మర ప్రచారం

అనంతపురం అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్ల సంక్షేమ సంఘానికి శనివారం ఎన్నికలు జరగనున్నాయి. గతంలో గత నెల 23న అనంతపురం నగరం కళ్యాణదుర్గం రోడ్డులోని రజాక్ ఫంక్షన్ హాల్‌లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని నిర్ణయించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులు ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు పోటీదారులు అంగీకరించలేదు. దీంతో అప్పట్లో కార్యక్రమం వాయిదా పడింది. అయినప్పటికీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఇద్దరు చొప్పున పోటీ పడుతున్నారు. దీంతో శనివారం ఉదయం 10 గం టలకు రజాక్ ఫంక్షన్ హాల్‌లోనే ఎన్నికలు నిర్వహిం చాలని ఆ సంఘం రాష్ట్ర నాయకత్వం నిర్ణయించింది.

ఆ మూడు పదవులకే..

డీలర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఇద్దరేసి చొప్పున డీలర్లు పోటీలో ఉన్నారు. ఉమ్మడి జిల్లా డీలర్ల సంఘం అధ్యక్ష పదవికి వెంకటేష్, పార్థసారధి పోటీలో ఉన్నారు. ప్రధాన కార్యదర్శి పదవికి సిరిగుప్ప వెంకటేష్, భాస్కర్‌రెడ్డి, కోశాధికారి పదవికి రమేష్ రంగయ్య, వెంకట్‌బాబు పోటీలో పడుతున్నారు. మిగతా ఇద్దరు కార్యదర్శులను, ఇద్దరు ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకోనున్నట్లు సమాచారం. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులకు పోటీ అనివార్యం కావడంతో రహస్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని ఆ సంఘం నాయకులు నిర్ణయించారు. కొందరు డీలర్లను వ్యక్తిగతంగా కలిసి తమకే ఓటు వేయాలని కోరుతుండగా.. మరికొందరు ఫోన్ల ద్వారా అభ్యర్థిస్తున్నట్లు తెలిసింది. దీంతో ఎవరు గెలుస్తారనే ఉత్కంఠత డీలర్లలో నెలకొంది.

మట్టి అక్రమ రవాణా.. అర్ధరాత్రి ఉత్కంఠ

- ఎక్స్‌కవేటర్, నాలుగు ట్రాక్టర్ల సీజ్ • వదిలిపెట్టాలని అర్ధరాత్రి పోలీస్‌స్టేషన్‌కు వైసీపీ నాయకుడు

యాడికి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుణాంపల్లి వద్ద వంకలో మట్టిని అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను, ఎక్స్‌కవేటర్‌ను బుధవారం అర్ధరాత్రి పోలీసులు సీజ్‌చేశారు. మట్టి అక్రమ వ్యాపారం చేస్తున్న వ్యక్తి వైసీపీ మండల నాయకుడి సమీప బంధువు కావడం గమనార్హం. బుధవారం అర్ధరాత్రి తిరుణాంపల్లి వంకలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారనే సమాచారంతో మైన్స్ అండ్ జియాలజీ అధికారులు దాడిచేసి నాలుగు ట్రాక్టర్లను యాడికి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. మట్టి తవ్వుతున్న ఎక్స్‌కవేటర్, నాలుగు ట్రాక్టర్లు వైసీపీ మండల నాయకుడి సమీప బంధువుకు చెందినవి కావడంతో ఆయన పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్లి వాటిని వదిలిపెట్టాలని కోరినట్లు తెలిసింది. మైన్స్ అండ్ జియాలజీ అధికారులు పోలీస్ స్టేషన్ వద్ద వదిలి వెళ్లారని తెలిపారు. ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను వదలాలని గురువారం కూడా సదరు నాయకుడు పోలీసుల వద్ద మంతనాలు జరిపినట్లు తెలిసింది. మైన్స్ అండ్ జియాలజీ అధికారులు తర్వాత పోలీస్‌స్టేషన్ వద్దకు రాలేదు. మట్టి రవాణాపై రెవెన్యూ అధికారులు సరైన ఆదేశాలు ఇవ్వలేదు. ఈ నాటకీయ పరిణామాల మధ్య వాల్టా చట్ట ఉల్లంఘన చేసి మట్టి అక్రమ రవాణా చేస్తున్నట్లు పోలీసులు కేసు నమోదుచేశారు.



సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లు, తిరుణాంపల్లిలో వంకలో మట్టి తవ్విన దృశ్యం

నేటి నుంచి హనుమద్ దీక్ష



కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి

గుంతకల్లు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసారంభాన్ని పురస్కరించుకుని గుంతకల్లు మండలంలోని కసాపురం దేవస్థానంలో శనివారం హనుమద్ దీక్షలను ప్రారంభించనున్నారు. కసాపురం ఆలయంలో దీపావళి పర్వదినం అనంతరం కార్తీక పాడ్యమి తిథిన హనుమద్ దీక్షాపరులకు మాలాధారణ నిర్వహిస్తారు. శనివారం వేకువనే ఆలయానికి వచ్చే భక్తులకు ఆలయ అర్చకులు, వేద పండితుల సమక్షంలో శాస్త్రోక్తంగా హనుమద్ మాలాధారణగావించి, మండల దీక్షలను ప్రారంభింపజేస్తారు. ఇదే నెల 22వ తేదీన కార్తీక బహుళ సప్తమి సందర్భంగా 20 రోజుల హనుమద్ అర్ధ మండల దీక్షలను ప్రారంభింపజేస్తారు. డిసెంబరు 12న హనుమద్ మండల, అర్ధ మండల దీక్షలను పూర్తిచేసిన మాలాధారులు కసాపురం దేవస్థానానికి వచ్చి ఇరుముడులను సమర్పిస్తారు. మరుసటి రోజు మార్గశిర శుద్ధ త్రయోదశి డిసెంబరు 13న ఆలయంలో హనుమద్వ్రత కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించి, మాలాధారుల దీక్షలను విరమింపజేస్తారు. హనుమద్ మండల దీక్షా ప్రారంభం స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన శనివారం రోజునే వచ్చినందున భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి మాలలను ధరించాలని ఆలయ ఈఓ కె. వాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఒకే పోస్టుకు ఇద్దరు అధికారులు

వివాదంగా మారిన ఆన్‌సెట్ సీఈఓ నియామకం



అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఒకే పోస్టుకు ఇద్దరు అధికారులను నియమించారు. దీంతో ఆన్‌సెట్ సీఈఓ నియామకం వివాదంగా మారింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబరు 1836 ప్రకారం వెయిటింగ్‌లో ఉన్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవిశంకర్‌రెడ్డిని అనంతపురం ఆన్‌సెట్ సీఈఓ, జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారిగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు టూరిజం రీజనల్ డైరెక్టర్‌గా ఉన్న వెంకటేశ్వర్లుకు ఆన్‌సెట్ సీఈఓ, జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఈ పోస్టుకు ఎవరు చేరుతారో...ఎవరు బాధ్యతలు స్వీకరిస్తారనేది ఉత్కంఠ నెలకొంది.

అభివృద్ధి పనులకు కలెక్టర్ భూమిపూజ



రాగులపాడు వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కలెక్టర్

ఉరవకొండ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలో కలెక్టర్ వినోద్ కుమార్ శుక్రవారం పర్యటించి పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. తొలుత మండల కేంద్రంలోని రాజీవ్‌కాలనీలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలను తనిఖీ చేసి అక్కడి రికార్డులను పరిశీలించారు. మండల ప్రత్యేకాధికారి హాజరు కాకపోవడంతో షోకాజ్ నోటీస్ జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంత నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. వెంకటాంపల్లిలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన కందకాల పనులను పరిశీలించారు. అక్కడే ఉపాధి పథకం కింద ఆనంద్ అనే వ్యక్తి రూ.2.30 లక్షల వ్యయంతో చేపట్టిన పశువులషెడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. రాగులపాడు సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమాల్లో డ్వామా పీడీ సలీం బాషా, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ నయాజ్ అహ్మద్, ఎంపీడీఓ రవిప్రసాద్, డ్వామా ఏపీడీ శైలజ, టీడీపీ మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ ఇన్‌చార్జి ఎస్‌ఈగా హరిప్రసాద్

పీఐయూ ఇన్‌చార్జి ఈఈగా ప్రభాకర్‌రెడ్డి

అనంతపురం సిటీ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రోడ్లు భవనాల శాఖ (ఆర్ అండ్‌బీ) ఇన్‌చార్జి ఎస్‌ఈగా ఎన్‌హెచ్ ఎస్‌ఈగా పనిచేస్తున్న హరిప్రసాద్‌కు బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ ఈఎన్‌సీ నయీముల్లా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎస్‌ఈగా పనిచేస్తున్న ఓబుల్‌రెడ్డి గురువారం పదవీ విరమణ పొందారు. జిల్లా పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని పీఐయూ ఈఈ కేవీకేవీ ప్రసాద్ కూడా పదవీ చేశారు. దీంతో పీఐయూ ఇన్‌చార్జి ఈఈగా అదే శాఖ పరిధిలోని అనంతపురం పీఆర్ఐ డివిజన్ ఈఈగా పనిచేస్తున్న ప్రభాకర్ రెడ్డిని నియమిస్తూ ఆ శాఖ ఈఎన్‌సీ బాలునాయక్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయా స్థానాల్లో వారు అదనపు బాధ్యతలు స్వీకరించారు.

పల్లెదారుల్లో ఇక పరుగులు

గ్రామీణ రోడ్లకు నూతన శోభ


పల్లె పండుగలో రాజీవ్‌కాలనీలో సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

- వారం రోజుల్లోనే 70 శాతం పనులు ప్రారంభం
- సంక్రాంతికి పూర్తి చేయడమే లక్ష్యం
- రోడ్లను విస్మరించిన వైసీపీ

గ్రామీణ రహదారుల్లో ఇక పరుగులు తీయవచ్చు. నిన్నటి వరకూ గుంతలమయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డ గ్రామీణులు నూతన రహదారులతో సులభంగా ప్రయాణం చేయవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం జిల్లాలో శరవేగంగా జరుగుతోంది. వర్షాలు కురిసినా ఎక్కడా సీసీరోడ్లు, బీటీ రోడ్ల పనులు ఆపలేదు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎక్కడికక్కడ రోడ్ల నిర్మాణానికి భూమి పూజలు చేశారు. పల్లె రోడ్లకు కూటమి ప్రభుత్వం జిల్లాలో రూ. 100 కోట్లు కేటాయించి 1521 రోడ్లకు శ్రీకారం చుట్టింది. ఇందులో సీసీ రోడ్లు 1515, బీటీ రోడ్లు 6 ఉన్నాయి. ఇప్పటికే వెయ్యికి పైగా రోడ్ల పనులను ప్రారంభించారు. -ఆంధ్రజ్యోతి, అనంతపురం సిటీ

సందడిగా ప్రారంభం

అనంతపురం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో రోడ్డు పనులను సందడిగా ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. పల్లె రోడ్లకు రూ.100 కోట్ల నిధులను మంజూరు చేశారు. దీంతో అక్టోబరు 14 నుంచి ఆయా ప్రాంతాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు రోడ్లకు భూమి పూజలు చేశారు. వారం రోజుల్లోనే 1521 రోడ్లలో 1000 రోడ్లకు పైగా (70శాతం) పనులకు భూమి పూజ చేశారు. ఈ పనులన్నింటినీ సంక్రాంతి పండుగలోపు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ దిశగా ఆ శాఖ అధికారులు, సిబ్బంది పనులను పర్యవేక్షిస్తున్నారు. రోడ్లన్నీ పూర్తయితే సంక్రాంతికి పల్లె రహదారులకు నూతన శోభ రానుంది.

పల్లె రోడ్లను విస్మరించిన వైసీపీ

గత ఐదేళ్ల పాలనలో వైసీపీ పల్లె రోడ్లను ఏమాత్రం పట్టించుకోలేదు. కనీసం మరమ్మతులు కూడా చేయని దుస్థితి. తద్వారా ఎక్కడికక్కడ రోడ్లు అధ్వానస్థితికి చేరి ఆయా ప్రాంతాల ప్రజలు అవస్థల నడుమ రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాలు కురిసిన సమయాల్లో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. మరికొన్ని ప్రాంతాల్లో గుంతల రోడ్లతో తీవ్ర ఇబ్బందులు పడేవారు.



వేగంగా పనులు చేయిస్తున్నాం

ప్రభుత్వ ఆదేశాలు మేరకు.. మంజూరు చేసిన నిధులతో జిల్లా వ్యాప్తంగా సీసీ, బీటీ రోడ్ల పనులను వేగవంతంగా చేయిస్తున్నాం. ప్రణాళికాబద్ధంగా పనులను చేయిస్తున్నాం. ఎక్కడా నాణ్యత తగ్గకుండా చూస్తున్నాం. రోడ్లన్నీ పూర్తయితే పల్లె ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

- జహీర్ అస్లాం, ఎస్‌ఈ, పంచాయతీ రాజ్‌శాఖ

రోజువారీగా సమీక్షిస్తున్నాం

పల్లె పండుగ కార్యక్రమంలో చేస్తున్న పనులపై ప్రతిరోజూ ఆరా తీసి వేగంగా పనులు జరిగేలా చూస్తున్నాం. మంత్రులు, ఎమ్మెల్యేలతో భూమి పూజ చేయించి పనులను ప్రారంభించాం. లక్ష్యం ప్రకారం సంక్రాంతి పండుగ లోపు జిల్లాలో రోడ్ల పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చే విధంగా చూస్తాం.



- ప్రభాకర్‌రెడ్డి, ఈఈ, పంచాయతీ రాజ్‌శాఖ

అధికారుల అత్యుత్సాహం

- పంచాయతీ కార్యదర్శులకు తిప్పలు
- గాలిలో 73 మంది..
- వేతనాలు అందక లబోదిబో
- పట్టించుకోని ఉన్నతాధికారులు


డీపీఓ కార్యాలయం

అనంతపురం న్యూటౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ కార్యాలయ అధికారుల అత్యుత్సాహంతో పలువురు పంచాయతీ కార్యదర్శులకు తిప్పలు తప్పడం లేదు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల కార్యదర్శులు వేతనాలు అందక లబోదిబోమంటున్నారు. ఉన్నతాధికారులు తమ స్థానాన్ని పదిలం చేసుకోవడానికి నాడు రాజకీయ సిఫార్సులకు తలొగ్గి సమస్యలు తెచ్చిపెట్టి ఆఖరికి గాలిలో నిలబెట్టారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ రాక ముందు పంచాయతీల్లో గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 వరకు నాలుగు గ్రేడ్స్‌లో కార్యదర్శులు ఉండేవారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సచివాలయ వ్యవస్థలో భాగంగా గ్రేడ్-5, గ్రేడ్-6 కార్యదర్శుల నియామకానికి శ్రీకారం చుట్టింది. నూతనంగా నియమితులైన వారికి అప్పటికే గ్రేడ్-4 వరకు ఉన్న కార్యదర్శులతో సమానంగా డీడీఓ పవర్స్ ఇచ్చి ప్రతి పంచాయతీకి ఒక కార్యదర్శి ఉండేలా చర్యలు తీసుకోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పంచాయతీల సంఖ్య కంటే కార్యదర్శులు ఎక్కువగా ఉండడంతో కొందరు కార్యదర్శులు గ్రేడ్స్‌కు అతీతంగా గాలిలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో 1044 పంచాయతీలు ఉన్నాయి. వీరిలో గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 వరకు 605 మంది ఉన్నారు. సచివాలయ కార్యదర్శులు గ్రేడ్-5కు 512 మంది ఎంపికయ్యారు. దీంతో కార్యదర్శుల సంఖ్య 1117కు చేరింది. జిల్లాలో పంచాయతీల సంఖ్య కంటే 73 మంది అదనంగా ఉన్నారు. వీరిలో చాలా మందికి ప్లేస్‌మెంట్స్ లేకపోవడంతో వేతనం మంజూరు కాని పరిస్థితి ఏర్పడింది. జిల్లా పంచాయతీ కార్యాలయ సిబ్బంది నానాతంటాలు పండి కొంత మందికి వెసులుబాటు కల్పించారు. మిగిలిన వారి పరిస్థితి అయోమయంగా ఉంది. గతంలో బదిలీల ప్రక్రియ చేపట్టిన అధికారులు ప్రస్తుతం లేరు. ప్రస్తుత డీపీఓ నుంచి మిగిలిన సిబ్బంది అందరూ కొత్తవారు కావడంతో గతంలో చేసిన తప్పిదాలను తామెందుకు సరిదిద్దాలన్న ఉద్దేశంతో వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. నూతన డీపీఓ నాగరాజునాయుడు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని బాధిత కార్యదర్శులు కోరుతున్నారు.

టమోటా కిలో రూ.23

అనంతపురం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం 675 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.18, కనిష్ఠ ధర రూ.13 పలికినట్లు ఆయన తెలిపారు.

రిజర్వేషన్ బుకింగ్ నూతన విధానం ప్రారంభం

గుంతకల్లు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రైల్వేలో రిజర్వేషన్ టికెట్ 60 రోజుల ముందు నుంచి అడ్వాన్స్ బుకింగ్ చేసుకునే నూతన విధానం శుక్రవారం ప్రారంభమైంది. నిన్నటి వరకూ 120 రోజుల ముందు టికెట్ రిజర్వేషన్ చేసుకునే విధానం (అడ్వాన్స్ రిజర్వేషన్ పీరియడ్) అమల్లో ఉండేది. రైల్వే మంత్రిత్వశాఖ 120 రోజుల ముందు రిజర్వేషన్ చేసుకునే కాల పరిమితిని సగానికి కుదించి 60 రోజుల ముందు నుంచే రిజర్వేషన్ చేసుకునే విధంగా నిబంధనలను మార్చడానికి గత నెలలో నిర్ణయించింది. ట్రెయిన్ బెర్త్ రిజర్వేషన్‌లో జరుగుతున్న అక్రమాలను తొలగించడం కోసం ఈ విధానాన్ని అమలులోకి తెస్తున్నట్లు రైల్వే శాఖ పేర్కొంది. ఈ మేరకు నవంబరు 1వ తేదీ నుంచి మార్పుచేసిన విధానం అమల్లోకి వచ్చింది.

1085 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శుక్రవారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1085 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2కు 1,079 క్యూసెక్కులు వెళుతోందన్నారు. ప్రస్తుతం 1.664 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

ఖాకీ వెన్నులో వణుకు



గ్యాంగ్ రేప్ కేసు నిందితులను లోతుగా విచారించిన ఉన్నతాధికారులు

- పలువురు పోలీసు సిబ్బంది సహకారాన్ని బయటపెట్టినట్లు సమాచారం
- ఆ శాఖలో కలవరం
- జాబితాలో తామున్నామా అంటూ ఆరా..
- సస్పెన్షనా.. బదిలీనా.. అని చర్చ
- పురంలో హాట్ టాపిక్‌గా విచారణ



చిలమత్తూరు మండలంలో గ్యాంగ్‌రేప్ కేసులో నిందితులు, మోస్ట్‌వాంటెడ్ అంతర్రాష్ట్ర దొంగలను ఉన్నతాధికారులు లోతుగా విచారించడం ఖాకీల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. నిందితులపై పదుల సంఖ్యలో చోరీలు, దోపిడీలు, అత్యాచారం కేసులున్నా వారు దర్జాగా బయట ఎలా తిరుగుతున్నారన్న దానిపై ఉన్నతాధికారులు కూపీ లాగినట్లు తెలిసింది. ఇందులో తమకు సహకరించిన పోలీసుల బండారాన్ని నిందితులు బయటపెట్టినట్లు సమాచారం. వారు చెప్పిన విషయాలు విని, పోలీసు ఉన్నతాధికారులే విస్మయం వ్యక్తం చేస్తున్నట్లు చర్చ సాగుతోంది. నిందితులు వెల్లడించిన మేరకు వారికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన పోలీసు సిబ్బంది వెన్నులో వణుకు పుడుతోంది. ఈ నేపథ్యంలో కొంతమందిపై వేటు పడే అవకాశం ఉంది. ఇదే హిందూపురంలో ప్రస్తుతం పోలీసు శాఖలో హాట్‌టాపిక్‌గా మారింది.

హిందూపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) ఇటీవల సంచలనం రేకెత్తించిన సామూహిక అత్యాచారం కేసులో పట్టుబడిన నిందితులు పేరుమోసిన, మోస్ట్ వాంటెడ్ అంతర్రాష్ట్ర నేరస్తులు. దీంతో పోలీసు ఉన్నతాధి కారులు.. వారిని అదుపులోకి తీసుకుని, సామూహిక అత్యాచారం కేసుతోపాటు పాత వాటిపై లోతుగా విచారించినట్లు తెలిసింది. నిందితులు కొన్నేళ్లుగా దోపిడీలు, అత్యాచారాలు, చోరీలు చేస్తుండడం, పోలీసులకు పట్టుబడినా జైలు నుంచి వచ్చి మళ్లీ కొనసాగిస్తుండటంపై ఉన్నతాధికారులకు అనుమానం వచ్చి రహస్యంగా విచారణ చేపట్టారు. పోలీసు సిబ్బందిపైనే దిమ్మతిరిగే విషయాలను నిందితులు ఉన్నతాధికారులకు చెప్పడంతో వారు నివ్వెరపోయినట్లు తెలిసింది. అందుకే ఇన్నేళ్లపాటు పేరుమోసిన దొంగలు, అంతర్రాష్ట్ర ముఠా హిందూపురంలో దర్జాగా తిరుగుతున్నట్లు వెల్లడైందని సమాచారం. వారికి కొంతమంది పోలీసు సిబ్బంది సలాం కొట్టడం, వారితోనే చేతులు కలపడం వెరసి నిందితులు అత్యాచారాల వైపు వెళ్లారని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

లోతుగా విచారించిన ఉన్నతాధికారులు

సామూహిక అత్యాచారం కేసులో పట్టుబడిన నిందితులు పాత నేరస్తులు కావడంతో వారిని పలు కేసుల్లో విచారించారు. అందులో గంజాయి, కొత్తరకం డ్రగ్స్, అత్యాచారాలు, దోపిడీలు, చోరీలపై ఆరాతీశారు. ఇన్ని కేసుల్లో నిందితులై ఉండి దర్జాగా ఎలా బయట తిరుగుతున్నారని ఓ ఉన్నతాధికారి ప్రశ్నించగా.. అప్పుడు కొంతమంది సిబ్బంది బాగోతం బయటపెట్టినట్లు తెలిసింది. నిందితులు పట్టుబడినపుడు వారిని బయటకు తీసుకురావడానికి కొంతమంది గ్రూపుగా ఏర్పడి, బెయిల్‌కు కావాల్సిన ఖర్చు భరించేవారని పోలీసు విచారణలో వెల్లడించినట్లు సమాచారం. నిందితులు బయటకు వచ్చాక మరో నేరం చేసి బెయిల్‌కు పెట్టిన ఖర్చుకు రెండింతలు ఇచ్చేవారని సమాచారం. ఈ బెయిల్‌కు బయట నుంచి సహకరించేవారిలో ఒకరిద్దరికి బంగారు వ్యాపారులతో సత్సంబంధాలున్నట్లు సమాచారం. వారు బయటకు వచ్చాక మరో చోరీగానీ, నేరంగానీ తద్వారా వచ్చిన సొమ్ములో నిందితులకు ఇచ్చేది కొంతే. మిగిలింది మొత్తం బెయిల్‌కు ఖర్చుపెట్టిన వారికే ఇవ్వాల్సి వచ్చేదని విచారణలో ఒప్పుకున్నట్లు సమాచారం. అంతేకాక పోలీసు సిబ్బంది కూడా నిందితులకు పరోక్షంగా, ప్రత్యక్షంగా సహకరించినట్లు ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది.

జాబితాలో మేమున్నామా?

సామూహిక అత్యాచారం కేసు నిందితులను ఉన్నతాధికారులు విచారించిన సమయంలో వారు కొంతమంది పోలీసు సిబ్బంది పేర్లు వెల్లడించినట్లు తెలిసింది. అత్యాచారం కేసులో పట్టుబడిన ఒకరిద్దరు నిందితులు గతంలో హిందూపురం మండలంలో జరిగిన ఓ కీలక కేసులో తమను తప్పించినట్లు ఉన్నతాధికారికి లిఖితపూర్వకంగా సమాచారం ఇచ్చినట్లు సమాచారం. వారు చెప్పిన జాబితాలో హిందూపురంలోని మూడు పోలీసు స్టేషన్ల పరిధిలో ఆరేడుగురి సిబ్బంది వ్యవహారాలు బట్టబయలు చేసినట్లు సమాచారం. నిందితులు చెప్పిన జాబితాలో తామున్నామా అంటూ పోలీసు సిబ్బంది చర్చించుకుంటున్నారు. వారు చెప్పిన జాబితాలో ఉన్న సిబ్బంది ఇప్పటికే తమపై వేటు పడుతుందని అంచనాకు వచ్చేశారు. దీంతో తాము హిందూపురం వదిలి వేరే చోటికి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని ముందుగానే చెప్పుకుంటున్నారు. నిందితులకు సహకరించిన ఒకరిద్దరు కానిస్టేబుళ్లు తమ విషయం ఎలాగూ బయటకు వస్తుందన్న ఉద్దేశంతో ఒకరిద్దరు అధికారులు, మరికొంత సిబ్బంది మీద ఉన్నతాధికారికి వాట్సాప్ ద్వారా మెసేజ్ చేసినట్లు చర్చ సాగుతోంది. తాము చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఇలాంటి ఆరోపణలు చేసినట్లు ఉన్నతాధికారుల రహస్య విచారణలో వెల్లడైంది. దీంతో సదరు సిబ్బందిపై ఉన్నతాధికారులు గుర్రుగా ఉన్నారని తెలిసింది. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి జిల్లాకు రాష్ట్ర హోంశాఖ మంత్రి, డీజీపీ త్వరలో రానున్నారు. వారు వచ్చి వెళ్లాక వారంలోపే జిల్లాలో పోలీసు బదిలీలున్నాయి. ఈ బదిలీల్లో ఉన్నతాధికారులు గుర్తించిన సిబ్బందిపై వేటు వేస్తారా, శాఖాపరమైన చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తారా అన్నది కొన్నిరోజుల్లో తేలనుంది. ఏది ఏమైనా అత్యాచారం కేసు నిందితుల విచారణ పోలీసుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది.

ఎర్రచందనం కేసులో వైసీపీ నాయకుడి అరెస్టు


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ

నంబులపూలకుంట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెడబల్లి గ్రామ సమీపంలో విశ్వనాథ్‌రెడ్డి పొలంలో బయటపడిన ఎర్రచందనం దుంగల కేసులో అదే ఊరికి చెందిన వైసీపీ నాయకుడు మహేశ్వర్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్‌ఐ వలీబాషా స్థానిక స్టేషన్‌లో శుక్రవారం వెల్లడించారు. గతంలో ఎర్రచందనం దుంగలను పొలంలో డంప్ చేశారు. వాటిని గత నెల 27న తరలించేందుకు ప్రయత్నించగా.. పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు వెళ్లగా దుండగులు వాటిని వదిలేసి, పరారయ్యారు. పోలీసులు.. దుండగలను స్వాధీనం చేసుకున్నారు. 275 కేజీలు బరువున్న 21 దుంగలను పట్టుకున్నారు. వాటి విలువ రూ.5.50 లక్షలుగా లెక్కగట్టారు. దీనిపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా పెడబల్లి బస్టాండు వద్ద శుక్రవారం నిందితుడు అదే ఊరికి చెందిన మహేశ్వర్‌రెడ్డిని అరెస్టు చేశారు. పరిపోయిన మిగతా నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్‌ఐ వెల్లడించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ హత్య


మెహతాజ్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వివాహేతర బంధం హత్యకు దారితీసింది. ఓబుళదేవరచెరువు మండలం కొండకమర్లకు చెందిన మెహతాజ్ (32)ను ఆమె ప్రియుడు ఇర్ఫాన్ గురువారం రాత్రి హత్య చేసినట్లు పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొండకమర్లకు చెందిన గొర్ల అల్లాబక్షు పెద్దకుమార్తె మెహతాజ్‌ను అదే గ్రామానికి చెందిన బాబ్‌జాన్‌కిచ్చి 14 ఏళ్ల క్రితం వివాహం చేశారు. ఈమెకు మండలంలోని డబురువారిపల్లికి చెందిన చెందిన ఇర్ఫాన్‌తో వివాహేతర బంధం ఏర్పడింది. మెహతాజ్.. మరొకరితో వివాహేతర బంధం కొనసాగిస్తోందని ఇర్ఫాన్ అనుమానం పెంచుకున్నాడు. ఆమెను చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో రెండ్రోజుల క్రితం మెహతాజ్.. పిల్లలతో కలిసి పుట్టింటికెళ్లింది. ఇర్ఫాన్ పథకం ప్రకారం గతనెల 31వతేదీ రాత్రి మెహతాజ్ ఇంట్లోకి వెళ్లాడు. ఆమెతో గొడవపడి గొంతునులిమి చంపేశాడు. ఇంటివెనుకవైపు నుంచి పారిపోయాడు. తరువాత గుర్తించిన కుటుంబీకులు.. పోలీసులకు సమాచారం అందించారు. హత్యాస్థలాన్ని డీఎస్పీ విజయ్‌కుమార్, ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామనీ, త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని డీఎస్పీ వెల్లడించారు. మెహతాజ్‌కు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కుటుంబ కలహాలతో దంపతుల ఆత్మహత్యాయత్నం

బత్తలపల్లి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టూరు గ్రామానికి చెందిన దంపతులు శ్రీరాములు, అశ్విని కుటుంబ కలహాలతో బుధవారం రాత్రి ఆత్మహత్యకు యత్నించారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీరాములు తాగుడుకు బానిసై, రోజూ భార్యతో గొడవపడేవాడు. బుధవారం రాత్రి కూడా గొడవపడ్డాడు. దీంతో మనస్తాపం చెందిన అశ్విని విషయం తాగగా.. శ్రీరాములు ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. వారి పిల్లలు గట్టిగా ఏడ్వడంతో చుట్టుపక్కల వారు వచ్చి, క్రిమిసంహారక మందు తాగి పడివున్న అశ్విని, ఉరికి వేలాడుతున్న శ్రీరాములును కిందికి దించి బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. అశ్విని కోలుకోగా.. శ్రీరాములు చికిత్స పొందుతున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

చంద్రబాబు చేతిలో రైతాంగం దగా

- అన్ని మండలాలను కరువు జాబితాలో చేర్చాలి
- వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం క్రైం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని రైతాంగం ప్రకృతి చేతిలోనే కాదు.. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల్లోనూ దగా పడిందని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. చంద్రబాబు మారలేదని, రైతాంగాన్ని ఆదుకునే విషయంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ జిల్లా కార్యలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖరీఫ్‌లో వర్షాభావం కారణంగా ఉమ్మడి జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని అన్నారు. అయినా ఉమ్మడి జిల్లాలో 17 మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా ప్రకటించి చేతులు దులుపుకోవడం భావ్యం కాదని అన్నారు. తక్షణం ఉమ్మడి జిల్లాలోని 63 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అప్పుడే కేంద్ర బృందం పర్యటించి, రైతులను ఆదుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ముగ్గురు మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని ఆయన కోరారు.

పోలవరం ఎత్తుపై..

పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గిస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదని అనంత అన్నారు. ఈ విషయంలో చంద్రబాబు మరోసారి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. పోలవరం ఎత్తు 45.72 మీటర్లు ఉంటే సుమారు 195 టీఎంసీలు నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. అలా కాకుండా 41.15 మీటర్లకు పరిమితం చేస్తే గరిష్ఠంగా 115 టీఎంసీలు మాత్రమే నిల్వ అవుతుందని అన్నారు. ఇదే జరిగితే పోలవరం వల్ల రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ ఎత్తును తగ్గిస్తూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్నా, ఏపీకి చెందిన కేంద్ర మంత్రులు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. రాయలసీమకు కృష్ణా జలాలల కోసం గతంలో అనేక ఉద్యమాలు జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. పోలవరం ప్రాజెక్టు వల్ల నేరుగా రాయలసీమకు లబ్ధి కలగకపోయినా పరోక్షంగా ప్రయోజనం ఉంటుందని అన్నారు. శ్రీశైలం నుంచి కృష్ణా జలాలు నాగార్జున సాగర్‌కు వెళ్తున్నాయని, పోలవరం పూర్తయితే ఆ నీటిని రాయలసీమకు ఉపయోగించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్లతోనే నిర్మిస్తామని ప్రధాని నరేంద్రమోదీతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. లేదంటే కూటమి పార్టీలు, ప్రజాప్రతినిధులు మరోసారి రాష్ట్రానికి ద్రోహం చేసిన వారవుతారని అన్నారు.



హిందూపురం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): పరిగి మండలకేంద్రం సమీపంలోని చెరువు వరద నీటితో పూర్తిగా నిండి, మరువ పోతోంది. శుక్రవారం హోరుగా మరువ పారుతుండడంతో చుట్టుపక్కల గ్రామాలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఇటీవల కర్ణాటకలో కురిసిన భారీ వర్షాలకు కుముద్వతి, జయమంగళి ప్రవహించాయి. ఆ నదుల నీరు పరిగి చెరువుకు చేరుతోంది. శుక్రవారం చెరువు పూర్తిగా నిండి, మరువ నీరు పరవళ్లు తొక్కుతోంది.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య


బొమ్ము అనిల్ కుమార్ (ఫైల్)

రాప్తాడు, నవంబరు1(ఆంధ్రజ్యోతి): రాప్తాడు పంచాయతీ పరిధిలోని ముస్లిం మైనార్టీ కాలనీలో అప్పుల బాధ తాళలేక బొమ్ము అనిల్ కుమార్(41) ఉరి వేసుకున్నాడు. అనిల్‌కుమార్ మట్టి పెల్లల ఫ్యాక్టరీని నిర్వహించేవాడు. వ్యాపారం సరిగా నష్టపోయాడు. వ్యాపారం, కుటుంబ పోషణకు చేసిన అప్పులు తీర్చలేక ఇబ్బంది పడ్డాడు. అప్పుల వారి నుంచి ఒత్తిడి ఎక్కువైందని కుటుంబ సభ్యుల వద్ద ఆవేదన వ్యక్తం చేసేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కందుకూరు రోడ్డులోని రేకులషెడ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య హేమచంద్రిక, కుమారుడు లక్ష్మీ నితిన్, కూతురు హిమవర్షిణి ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

4న జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాక

పుట్టపర్తి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ, శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ సోమవారం పుట్టపర్తికి వస్తున్నారు. జిల్లా కేంద్రం పుట్టపర్తి సాయి ఆరామంలో ఉదయం పది గంటలకు నిర్వహించే ఎన్డీఏ కూటమి జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు.

9లోగా దరఖాస్తు చేసుకోండి

లేపాక్షి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): స్థానిక జవహర్ నవోదయ పాఠశాలలో 2025-26 సంవత్సరానికి 9, 11 తరగతుల్లో ప్రవేశానికి ఈనెల 9వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగరాజు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రస్తుతం 8, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు నవోదయ పాఠశాలలో సంప్రదించాలన్నారు.

వైసీపీ నాయకుడి మట్టి దందాపై చర్యలు తీసుకోండి

తహసీల్దార్‌కు టీడీపీ నాయకుల వినతి


వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

యాడికి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మట్టి దందా చేస్తున్న వైసీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం టీడీపీ నాయకులు మండలకేంద్రంలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు మాట్లాడుతూ... యాడికి గ్రామ పంచాయతీ పరిధిలో వైసీపీ మండల కన్వీనర్ మట్టిని అక్రమంగా రవాణా చేస్తూ దందా కొనసాగిస్తున్నారని తెలిపారు. గత ఐదేళ్లుగా మట్టి అక్రమ వ్యాపారానికి అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. ఆయన అక్రమంగా వేసిన లేఔట్‌లోకి ప్రభుత్వభూములు, వంకల్లోని మట్టిని పెద్దఎత్తున తరలించి సొమ్ముచేసుకున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అనధికార లేఔట్లు లెక్కలేనన్ని వేశారని తెలిపారు. వైసీపీ నాయకుడి మట్టి దందాపై విజిలెన్స్ అధికారులచేత విచారణ చేయించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు లక్ష్మణ్, ఆదినారాయణ, నాగశేఖర్, విజయ్, చంద్రశేఖర్, మధురాజు, నాగముని రెడ్డి, రవికుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అడిగేవారు లేరనా..?

- విచ్చలవిడిగా నిధుల వాడకం
- పదవీకాలం ముగిసినా కొనసాగుతున్న కార్యవర్గం
- ఒక వర్గానిదే ఆధిపత్యం
- అనంతపూర్ క్లబ్ ఎన్నికలపై వీడని సందిగ్ధత



అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రశ్నించేవారు లేరని తమకు నచ్చిన రీతిలో నిధులను దుర్వినియోగం చేశారు. అనంతపురం క్లబ్‌లో అక్రమాలకు అంతే లేకుండా పోతోంది. నగర నడిబొడ్డున సుమారు ఐదెకరాల్లో 1954లో ఆఫీసర్స్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. కాలక్రమంలో దానిని అనంతపూర్ క్లబ్‌గా మార్చారు. అప్పటి నుంచి క్లబ్‌లో బార్, పేకాట, క్రీడలతో పాటు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇటీవలే క్లబ్ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రస్తుత కార్యవర్గం పదవీకాలం ముగిసి ఐదు నెలలు కావస్తున్నా నేటికి కొనసాగుతున్నారు. ఇద్దరు సీనియర్ క్లబ్ సభ్యులు కలెక్టర్‌కు ఆధారాలతో ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు డీసీఓ, ఆర్డీఓ, తహసీల్దార్ విచారణ చేశారు. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనేది ఇప్పటికీ స్పష్టత రావడం లేదు. నిధుల దుర్వినియోగంపై క్లబ్‌లో ప్రశ్నించేనాథుడే లేడు. బోగస్ బిల్లులతో నిధులు ఐస్ ముక్కల్లా కరిగిపోతున్నాయి.

అంతులేని వింతలు

అంతులేని వింతలకు అనంతపురం క్లబ్ వేదికగా మారింది. 2020లో ఆకస్మికంగా తెరపైకి వచ్చిన రామాంజనేయులు క్లబ్ సెక్రటరీ అయ్యారు. 2022లో ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చారు. నామినేషన్ చివరిరోజు సాయంత్రం 5గంటలకు వైసీపీ రాప్తాడు కీలకనేత జోక్యంతో ప్రస్తుత కార్యదర్శి కేశవరెడ్డి తెరపైకి వచ్చారు. పోటీలో ఉన్న సభ్యులందరినీ బెదిరించి కేశవరెడ్డిని ఏకగ్రీవం చేశారు. కేశవరెడ్డి పదవీ కాలం ముగిసి 5 నెలలు కావస్తున్నా ఎన్నికలు నిర్వహించలేదు.

విచ్చలవిడిగా నిధుల వాడకం

అనంతపురం క్లబ్‌లో సుమారు 20 ఏళ్లుగా విచ్చలవిడిగా నిధుల వాడేస్తున్నారు. 15 ఏళ్ల పాటు క్లబ్ సెక్రటరీగా పనిచేసిన గాంధీరెడ్డి హయాంలో కోట్లాది రూపాయల నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా క్లబ్ కాంప్లెక్స్‌లో అద్దె గదుల నిర్వహణ, బార్ ఏర్పాటులో గోల్‌మాల్ జరిగింది. అధికారికంగా క్లబ్ ఆవరణంలో 10 షాపులు, ఒక హోటల్‌ను అద్దెకు ఇచ్చారు. ఇందులో క్లబ్‌కు కట్టేది రూ.1.80 లక్షలు మాత్రమే. వసూలు చేసేది రూ.10లక్షలకు పైగానే అని సమాచారం. సెక్రటరీ ఆధ్వర్యంలో జరిగే క్లబ్ నిర్వహణలో అనేక రూపాలలో ఆదాయం ఉన్నప్పటికీ నిధులు ఎక్కడికి వెళ్తున్నాయో అర్థం కాని పరిస్థితి.

ఎన్నికలపై గందరగోళం

క్లబ్ ఎన్నికలపై గందరగోళం నెలకొంది. క్లబ్ ఓటర్లు, సభ్యులు, అద్దె గదుల వివాదాలపై డీసీఓ, ఆర్డీఓ, తహసీల్దార్ ఇప్పటికే విచారణ చేసి కలెక్టర్‌కు నివేదికను అందజేశారు. విచారణ అనంతరం ఎన్నికలు నిర్వహిస్తారని సభ్యులు భావించారు. పాలకవర్గంలో అధ్యక్షుడిగా కలెక్టర్, ఉపాధ్యక్షుడిగా ఎస్పీ వ్యవహరిస్తారు. ఎన్నికల్లో కార్యదర్శి, ఇద్దరు సంయుక్త కార్యదర్శులు, ఆరుగురు కార్యవర్గ సభ్యులను ఓటింగ్ ద్వారా ఎన్నుకుంటారు. ప్రస్తుతం ఎన్నికల నిర్వహణ పై సందిగ్ధం కొనసాగుతోంది.

కలెక్టర్‌కు నివేదిక అందజేశాం



అనంతపూర్ క్లబ్‌లో జరుగుతున్న కార్యకలాపాలు, ఓటర్ల జాబితా, అద్దె గదుల నిర్వహణపై పూర్తిగా విచారణ చేశాం. ఎన్నికల నోటిఫికేషన్‌కు సంబంధించిన వివరాలు సేకరించాం. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేశాం. క్లబ్‌లో నిధులు, అధికారాల దుర్వినియోగంపై పూర్తిగా విచారణ చేయలేదు. కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి కార్యాచరణ ఉంటుంది. ఇప్పటికే క్లబ్ గురించి అనేక ఫిర్యాదులు అందాయి. వాటన్నింటినీ పరిశీలిస్తున్నాం.

- వసంతబాబు, ఆర్డీఓ, అనంతపురం

దీపం పథకం అమలుపై సంబరాలు



10వ డివిజన్‌లో సిలిండర్లను ప్రదర్శిస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా సీఎం చంద్రబాబు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకాన్ని అమలు చేయడంతో టీడీపీ నాయకులు స్థానిక మహిళలతో కలిసి సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం స్థానిక 10వ డివిజన్‌లో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు స్థానిక నాయకులు, మహిళలతో కలిసి సిలిండర్లు ప్రదర్శించి, ఆనందాన్ని వ్యక్తం చేశారు. 48వ డివిజన్‌లో తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వప్న, ముస్లిం మైనార్టీ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి సైఫుద్దీన్, నాయకులు ఆనందాన్ని పంచుకున్నారు. పోతుల రాజేశ్వరి, మంజునాథ్, భావన పాల్గొన్నారు.



48వ డివిజన్‌లో సిలిండర్లను ప్రదర్శిస్తున్న స్వప్న, సైఫుద్దీన్



నార్పలలో మహిళలకు సిలిండర్ అందిస్తున్న ఆలం వెంకట నరసానాయుడు



శింగనమలలో పథకాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

వైభవంగా కొల్లాపురమ్మదేవి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

చెన్నేకొత్తపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన గ్రామదేవత కొల్లాపురమ్మదేవి రథోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. దీపావళిపర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతియేటా అమ్మవారి రథోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సారి నూతనంగా ఆలయాన్ని నిర్మించి విగ్రహప్రతిష్ఠ అనంతరం మొదటిసారి వేడుకలు జరుగుతుండటంతో భక్తులు బారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు పర్యవేక్షించారు.

ఎంఎస్ రాజుకు అభినందనలు



టీటీడీ బోర్డు మెంబర్ ఎంఎస్ రాజుకు సన్మానిస్తున్న నాయకులు

బుక్కరాయసముద్రం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజుకు టీటీడీ బోర్డు మెంబర్ ఇవ్వడంతో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి శుక్రవారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మాజీ సర్పంచ్ రామానాయుడు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మల్లికార్జునరెడ్డి ఉన్నారు.

అమలు కాని 'ఇంటి వద్దకే పింఛన్'



భానుకోట సచివాలయంలో పింఛన్ కోసం వేచివున్న వృద్ధులు

కనగానపల్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ ఇంటి వద్ద అందించాలనే కార్యక్రమం మండలంలో అమలు కాలేదు. శుక్రవారం ఉదయాన్నే ప్రతి పింఛన్ దారుని ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ అందించాల్సిన సచివాలయ సిబ్బంది ఒకచోట ఉండి గుంపులు గుంపులుగా పింఛన్ అందించారని లబ్ధిదారులు ఆరోపించారు. ఇంటి దగ్గరకు వస్తారని వేచి చూసినా ఎంత సేపటికీ అధికారులు రాకపోవడంతో వారి వద్దకే వెళ్లి పింఛన్ తెచ్చుకున్నామని వృద్ధులు తెలిపారు.

టీడీపీ సభ్యత్వ నమోదులో ముందుండాలి

కనగానపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో కనగానపల్లి మండలం ముందుండాలని నియోజకవర్గ కో-ఆర్డినేటర్ సుధాకర్‌చౌదరి అన్నారు. స్థానిక పరిటాల రవీంద్ర భవనంలో శుక్రవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గ్రామాలవారీగా సభ్యత్వ నమోదు వివరాల వెల్లడించారు. కన్వీనర్ యాతం పోతలయ్య, నెట్టెం వెంకటేష్, వెంకటేష్, ఎంపీటీసీ బిల్లే భాస్కర్, బట్టా సురేష్‌చౌదరి, సర్పంచులు సోమర చంద్రశేఖర్, అంజి, రామంజి, మనోహర్‌నాయుడు, అంకే వన్నూరప్ప పాల్గొన్నారు.

వెటర్నరీ కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి

రామగిరి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వెటర్నరీ కాంట్రాక్టు ఉద్యోగి రవి(38) అనారోగ్యంతో శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందారు. ఈయన నసనకోట పశువైద్య కేంద్రంలో పనిచేస్తుండేవాడు. గురువారం సాయంత్రం ఉన్నఫళంగా ముక్కులో రక్తం కారుతుండటంతో కుటుంబసభ్యులు అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి మౌలాలి, సిబ్బంది మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అతనికి ప్రభుత్వం నుంచి అన్ని విధాల సహాయ సహకారాలు అందేలా చూస్తామన్నారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

27న ఉచిత కంటివైద్య శిబిరం

నార్పల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దలపల్లిలో కాశిరెడ్డి నాయన ఆశ్రమం ఆధ్వర్యంలో 27న బెంగళూరులోని శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరంలో కంటి పరీక్షలు, కంటి శుక్లాల పరీక్ష చేసుకొని ఆపరేషన్‌కు అవసరమైన వారిని అదే రోజు బెంగళూరుకు తీసుకెళ్లి శస్త్రచికిత్స చేయిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

4న జాబ్‌మేళా

నార్పల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా 4వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు అనంతపురం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి వీవీ ప్రతాప్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, హీల్‌మై ఫ్యామిలీ హెల్త్ కేర్ కంపెనీ వారు పాల్గొంటారు. పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన అభ్యర్థులు, 18 నుంచి 45 సంవత్సరాలలోపు యువతీ, యువకులు పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాల కోరకు 9010039901 నంబరును సంప్రదించాలన్నారు.

నేడు మాదిగల ఆత్మీయ సమావేశం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలని కోరుతూ శనివారం స్థానిక ఎన్జీఓ హోంలో మాదిగల ఆత్మీయసమావేశం నిర్వహించనున్నట్లు ఎంఆర్పీఎస్ జిల్లా ప్రతినిధులు రాజశేఖర్, చలపతి తెలిపారు. జడ్పీ వద్ద నుంచి ర్యాలీగా వచ్చి అంబేడ్కర్, జగజ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసిన టవర్‌క్లాక్ వరకు కొనసాగుతుందని తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగా సంజయ్, వర్కింగ్ ప్రెసిడెంట్ టీఎం రమేష్‌లు హాజరవుతారన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న మాదిగలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

టీడీపీతోనే సంక్షేమం

అనంతపురంరూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీతోనే ప్రజాసంక్షేమం సాధ్యమని మండల ప్రధాన కార్యదర్శి పాములరాయి రఘు అన్నారు. శుక్రవారం మండలంలోని పాములరాయి గ్రామంలో పింఛన్ పంపిణీ చేపట్టారు. గ్రామంలోని లబ్ధిదారులకు పింఛన్‌ను అందజేశారు. కూటమి నాయకులు రామాంజనేయులు, సుబ్బారావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



తిమ్మంపేటలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీపీఓ

అనంతపురం న్యూటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామపంచాయతీల్లో పారిశుధ్య తనిఖీల్లో భాగంగా శుక్రవారం గార్లదిన్నె మండలంలోని తిమ్మంపేటలో డీపీఓ నాగరాజ నాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక సర్పంచ్ భార్గవితో కలిసి పలు ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం సమీపంలో ఉన్న ఈఎల్ఎస్ఆర్ ట్యాంకును పరిశీలించి శుభ్రత చర్యలు తరచూ అమలు జరిగేలా ఆదేశించారు. మొదటి రోజు పింఛన్ పంపిణీని పరిశీలించారు.

చెస్ పోటీలకు నితీష్‌చౌదరి ఎంపిక



అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్-14 జాతీయ స్థాయి చెస్ పోటీలకు నితీష్‌చౌదరి ఎంపికయ్యాడు. ఇటీవల లేపాక్షి నవోదయ జవహర్ విద్యాలయంలో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్-14 బాలుర చెస్ పోటీలలో నగరానికి చెందిన నితీష్‌చౌదరి ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. త్వరలో మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఏపీ తరపున ఈ విద్యార్థి ప్రాతినిథ్యం వహించనున్నాడు. విద్యార్థిని కోచ్ ఉదయ్‌కుమార్ నాయుడు అభినందించారు.

జాతీయ కబడ్డీ పోటీలకు హిమజ



హిమజతో ప్రధానోపాధ్యాయుడు గొల్ల నారాయణ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారిణి హిమజ ఎంపికైంది. 5వతేదీ నుంచి మధ్యప్రదేశ్‌లో జరిగే ఎస్‌జీఎఫ్-17 కబడ్డీ జాతీయస్థాయి పోటీలకు హిమజ ఏపీ బాలికల కబడ్డీ జట్టు తరపున ప్రాతినిత్యం వహించనుంది. ఎంపికైన హిమజను కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొల్ల నారాయణ, పీడీ బాలకృష్ణ అభినందించారు.

చిరు వ్యాపారులకు నోటీసులు అన్యాయం

అనంతపురం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్కేయూనివర్సిటీ దగ్గర ఫుట్‌పాత్‌పై టిఫెన్ సెంటర్లు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న చిరువ్యాపారులకు నోటీసులు ఇవ్వడం అన్యాయమని సీఐటీయూ నాయకులు అన్నారు. శుక్రవారం చిరువ్యాపారుల సమస్యపై సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ అనితను కలసి వినతి పత్రం ఇచ్చారు. నాయకులు మాట్లాడుతూ ఇటీవల వ్యాపారులకు టిఫెన్ సెంటర్లను తొలగించాలని యూనివర్సిటీ ఇంజనీరింగ్ సూపరింటెండెంట్ నోటీసులు ఇచ్చారన్నారు. పేద విద్యార్థుల ఆకలి తీర్చేందుకు టిఫిన్‌సెంటర్లు ఏరాపటు చేశారన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, వంశీ, రాముడు, సండే, శివారెడ్డి, శాంత్‌రాజ్, చిరువ్యాపారులు అరుణమ్మ, గాయత్రి, ప్రమీల పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు నిలిపేయండి...

- కార్యాలయంలో ఓ వ్యక్తి హల్‌చల్ ● పోలీసులకు ఫిర్యాదు

అనంతపురం క్రైం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఓ వ్యక్తి రిజిస్ట్రేషన్లు ఆపాలని శుక్రవారం బెదిరింపులకు దిగాడు. దీంతో సబ్‌రిజిస్ట్రార్ ఇస్మాయిల్ నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రెండువర్గాలను స్టేషన్‌కు తీసుకెళ్లారు. నగరంలోని శ్రీనగర్ కాలనీలో గల్లా విల్లాస్ పేరుతో ఏర్పాటు చేసిన వెంచర్‌కు సంబంధించి 10 డాక్యుమెంట్లకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. తనకు న్యాయం జరగలేదని రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని మారుతినగర్‌కు చెందిన రాము అనే వ్యక్తి అధికారులను కోరారు. ఈ క్రమంలో వైసీపీ నాయకుడు నదీమ్, రాము వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో అధికారులు పోలీసులను పిలిపించారు. రూ.2కోట్ల పైచిలుకు విలువైన విల్లాను రూ.48లక్షలతోనే రిజిస్ట్రేషన్ చేయించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే అంతా బ్లాక్ మనీగా చేస్తున్నారని గుల్జార్‌పేటలోని గల్లా రవీంద్రనాథ్, గల్లా వెంకటశ్రీనివాస్ ఇళ్లలో ఐటీ అధికారుల దాడుల జరిగినట్లు సమాచారం. ఐటీ అధికారులు ఎంత స్వాధీనం చేసుకున్నారనే విషయంలో స్పష్టత రాలేదు.

బహుజనులకే బార్ కౌన్సిల్



మాట్లాడుతున్న బీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణప్ప

అనంతపురం సెంట్రల్, నవబంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బార్ కౌన్సిల్ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులు బహుజనులకే దక్కేలా బహుజన లాయర్ ఫోరం(బీఎల్ఎఫ్) పనిచేస్తోందని ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బానాసి నారాయణప్ప పేర్కొన్నారు. శుక్రవారం బీఎల్ఎఫ్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నారాయణప్ప మాట్లాడుతూ న్యాయసేవలు పొందే బాధిత ప్రజల తరపున 90శాతం మంది లాయర్లు బహుజన వర్గాలకు చెందిన వారేనన్నారు. అసోసియేషన్, కౌన్సిల్ తదితర వాటిలో ప్రాధాన్యం లభించకపోవడంతో వారి సంక్షేమం గాల్లోదీపమైందని వాపోయారు. పలు డిమాండ్లపై 24వ తేదీన విజయవాడలో నిర్వహించే బీఎల్ఎఫ్ ప్రథమ వార్షికోత్సవ సభలో చర్చించి తీర్మానాలు చేస్తారన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా మూర్తి, ఉపాధ్యాక్షులుగా రమేష్, ప్రధాన కార్యదర్శిగా మహేశ్వరి, కార్యదర్శిగా దామోదర్, ఆర్గనైజింగ్ సెక్రెటరిగా రేవతి, ట్రెజరర్‌గా అలివేలమ్మను ఎన్నుకున్నారు. న్యాయవాదులు గంగప్ప, హరిప్రసాద్ పాల్గొన్నారు.

సీనియారిటీ జాబితాలో పొరబాట్లను సరిదిద్దాలి

- డీఈఓను కోరిన ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ టీచర్ల ఉద్యోగోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితాలోని లోపాలను సరిచేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డీఈఓ ప్రసాద్ బాబును కోరారు. శుక్రవారం ఆ సంఘం నాయకులు డీఈఓను ఆయన చాంబర్‌లో కలిశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్ మాట్లాడుతూ సీనియారిటీ జాబితాలో రిటైర్డ్ అయిన వాళ్లు, చనిపోయిన వారి పేర్లు సైతం ఉంచారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా మున్సిపాలిటీలలో ఉన్న వివిధ పోస్టుల ఖాళీల వివరాలను ఇంత వరకూ ప్రకటించలేదన్నారు. పలువురు టీచర్ల వివరాలు, అర్హతలు వారి సర్వీస్ రిజిస్టర్‌లో నమోదైనప్పటికీ సీనియారిటీ జాబితాలో ప్రస్తావించలేదన్నారు. లోపాలు సవరించి సీనియారిటీ జాబితా విడుదల చేయాలని కోరారు. అపార్ ఐడీ జనరేషన్ కోసం క్షేత్ర స్థాయిలో అనేక ఇబ్బందులు తప్పడం లేదన్నారు. స్కూళ్లలో ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్లు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు డీఈఓకు వినతిపత్రం అందించారు. సంఘం పూర్వ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నరసింహులు, ఇతర నాయకులు బాబా ఫకృద్దీన్, సర్దార్ వలి, రమణ, కరీముల్లా, నస్రుల్లా, తిప్పేస్వామి, రామ్మూర్తి, హిమగిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు: ఎమ్మెల్యే



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పింఛన్లను అందిస్తామని ఎమ్మెల్యే పరిటాలసునీత అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటాపురం, శ్రీహరిపురం గ్రామాల్లో ఎమ్మెల్యే పింఛన్‌లను అందజేశారు. లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి పింఛన్‌లను అందించి ప్రతినెలా 1వ తేదీన పింఛన్‌లను ఇస్తున్నారా అని ఆరాతీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ ప్రభుత్వం పనితీరు ఏంటని ప్రశ్నించే వారికి పింఛన్‌లు తీసుకుంటున్న లబ్ధిదారులే సాక్ష్యం అన్నారు. బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్దిరం గయ్య, రామ్మూర్తినాయుడు, ధర్మవరపు బాలాజీ, సుబ్రమణ్యం, సుధాకర్, మారుతీప్రసాద్, పరందామయాదవ్, శ్రీహరిపురం అశోక్‌కుమార్, రఘు, ఎంపీడీఓ ఆజాద్, ఏఓ ప్రసాద్ పాల్గొన్నారు.

నగరపాలికలో ఇరువర్గాల గొడవ



రెండు వర్గాల మధ్య వాగ్వాదం

అనంతపురం క్రైం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరపాలిక మెయిన్ హాల్‌లో శుక్రవారం ఉదయం రెండు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. మెడపట్ల వరకూ వ్యవహారం వెళ్లింది. 2020 నుంచి 2024 వరకు 26మంది పారిశుధ్య కార్మికులకు వేతనాలు పడలేదని సీఐటీయూ నాయకులు వెంకటరమణ, ఏటీఎం నాగరాజు, నాగభూషణం ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి హర్ష కారణమని, అతన్ని ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో డ్రైవర్‌గా పనిచేస్తూ ఓ సంఘం పేరుతో నాయకత్వం నడిపిస్తున్న అజయ్‌బాబు, నగరపాలికలో పనిచేస్తున్న వెంకటేష్ కొందరితో కలిసి అక్కడికి వచ్చారు. హర్షకు మద్దతుగా మాట్లాడారు. ఈ క్రమంలో రెండువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అది తీవ్రస్థాయికి చేరి కొందరు మెడపట్లు పట్టుకున్నారు. ఉదయం, సాయంత్రం రెండుసార్లు ఇలా జరిగినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

సర్దార్ సేవలు చిరస్మరణీయం: వీసీ



నివాళులర్పిస్తున్న వీసీ సుదర్శన రావు

అనంతపురం సెంట్రల్, నవబంబరు1 (ఆంధ్రజ్యోతి) : దేశ రాజకీయ ఏకీకరణలో ప్రధాన పాత్రపోషించి, హోంశాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా పనిచేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు చిరస్మరణీయమని జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు అన్నారు. గురువారం ఆయన జయంతిని జేఎన్‌టీయూలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ పటేల్ చిత్రపటానికి నివాళులర్పించి విద్యార్థులు ఆయన జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఓఎస్‌డీటూ వీసీ దేవన్న, రిజిస్ట్రార్ క్రిష్ణయ్యతోపాటు పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.



పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చెన్నేకొత్తపల్లి: మండలంలోని మేడాపురం గ్రామంలో గురువారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రామీణ యూనాని వైద్యుడు ఖాదర్ ఆధ్వర్యంలో పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఉపసర్పంచ్ నారాయణ, వరదరాజులు, బాలక్రిష్ణ, సరస్వతి పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ ఎస్ఈకి ఘన వీడ్కోలు



ఎస్ఈని సన్మానిస్తున్న ఉద్యోగులు

అనంతపురం సిటీ, నవంబరు1(ఆంధ్రజ్యోతి): నగర శివారు రుద్రంపేట సమీపంలోని ఆర్ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ఆర్అండ్‌బీ ఎస్ఈ ఓబుల్‌రెడ్డి పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎన్‌హెచ్ ఎస్ఈ హరిప్రసాద్, కర్నూలు ఎస్ఈ మహేశ్వరరెడ్డి, కడప ఎస్ఈ శివకుమార్, రిటైర్డు ఎస్ఈ నాగరాజు హాజరై మాట్లాడారు. విధి నిర్వాహణలో ఈయన అందించిన సేవలు అందరికీ ఆదర్శమని కొనియాడారు. అనంతరం ఆయనను ఉద్యోగులు, పలువురు కాంట్రాక్టర్ల సమక్షంలో శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈఈలు రాజగోపాల్, ప్రసాద్‌రెడ్డి, సంజీవయ్య, డీఈఈలు, జేఈలు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



పొట్టిశ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచు, సిబ్బంది

నార్పల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిద్దరాచర్ల గ్రామ సచివాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని సర్పంచు సాకే రామాంజనేయులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పొట్టిశ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి సాకే కుళ్లాయప్ప, వార్డుమెంబరు సావిత్రమ్మ, వీఆర్వోలు మౌనిక, లక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనంతను కరువు జిల్లాగా ప్రకటించాలి



మాట్లాడుతున్న జాఫర్

శింగనమల నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక రామస్వామి దేవాలయంలో సీపీఐ మండల మహాసభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 31 మండలాలు కరువుతో అల్లాడుతుంటే, కేవలం 7 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించడం అన్యాయమన్నారు. జిల్లా నాయకులు పాణ్యం నారాయణ, కత్తినారాయణస్వామి, చెన్నప్పయాదవ్, రామాంజనేయులు, మధు, నేసే మధు పాల్గొన్నారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శి చిన్నప్ప యాదవ్, 15 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నాటుసారాను తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

గుత్తి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాటుసారాను రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. మండలంలోని బేతాపల్లి గ్రామ పొలాల నుంచి నాటు సారాను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం అందిందని, వెంటనే దాడులు నిర్వహించి నాటుసారాను తరలిస్తున్న బేతాపల్లికి నాగరాజు, సూరిని అరెస్ట్ చేశామని, అలాగే వారి వద్ద నుంచి 12 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని సీఐ చెప్పారు. ఎస్ఐ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నాటు సారా విక్రేత..

కణేకల్లు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కళేకుర్తి గ్రామానికి చెందిన హరిజన ఎర్రిస్వామి అనే వ్యక్తి నాటుసారా విక్రయిస్తుండడంతో అరెస్టు చేశామని ఎస్ఐ నాగమధు తెలిపారు. అందిన సమాచారం మేరకు శుక్రవారం అతడి ఇంటిపై దాడులు చేశామని, అక్కడ 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని అతడిని అరెస్టు చేశామని చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

5న వ్యాపారులతో సమావేశం

తాడిపత్రి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఈనెల 5వ తేదీన వ్యాపారులతో మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో బట్టల వ్యాపారులు, ఫ్యాన్సీస్టోర్స్ నిర్వాహకులు, డిజైనరింగ్ వర్క్స్, బ్యూటీపార్లర్ నిర్వాహకులు, బంగారుదుకాణాల యజమానులు, స్వచ్ఛంద మహిళా సంఘాల సభ్యులు పాల్గొనాలని సూచించారు.

కలెక్టర్‌కు వినతుల వెల్లువ

ఉరవకొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం చేపట్టిన ఉచిత గ్యాస్ సిలీండర్ల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన కలెక్టర్‌కు పలువురు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వినతి పత్రాలను అందజేశారు. స్థానిక రోడ్లు భవనాల వసతి గృహంలో టీడీపీ నాయకులు ప్యారం కేశవానంద కలెక్టర్‌ను కలిసి పలు సమస్యలపై విన్నవించారు. అలాగే ఉపాధి హామీ పథకంలో జరిగిన అక్రమాలపైన సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ, సీపీఎం నాయకులు మధుసూదన్, శీనప్ప చెన్నరాయుడు కోరారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆర్‌ఎస్ఎస్, జీవీఎస్ఎస్ నాయకులు చిరంజీవి పురుషోత్తం విన్నవించారు.

పొలాల్లో కేబుల్ చోరీ

పుట్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడ్డిపల్లి గ్రామశివారులో 9మంది రైతుల పొలాల్లో కేబుల్ చోరీకి గురైనట్లు ఎస్ఐ హేమాద్రి శుక్రవారం తెలిపారు. గురువారం దీపావళి సందర్భంగా రైతులు ఇళ్లవద్ద ఉండడంతో ఇదే అదునుగా చూసిన గుర్తుతెలియని వ్యక్తులు శ్రీనివాసులురెడ్డితోపాటు మరో 8మంది రైతులకు చెందిన పొలాల్లో బోర్ల వద్ద వైర్లను కట్‌చేసి ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రూ.20 వేలు ఆర్థిక సాయం

తాడిపత్రి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడ్డంవారివీధిలో నివాసం ఉంటున్న వెంకటరమణకు శుక్రవారం ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ వారు రూ.5వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు, రూ.20వేలు నగదును అందజేశారు. వెంకటరమణ కొంతకాలంగా కాలేయవ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో కుటుంబపోషణకు ఇబ్బంది పడుతుండడంతో విషయం తెలుసుకొని సంస్థ తరపున దాతల సహకారంతో ఈ సాయం చేసినట్లు సంస్థ అధ్యక్షుడు గుర్రప్ప తెలిపారు.

ప్రభుత్వాస్పత్రి తనిఖీ

కణేకల్లు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల ప్రభుత్వాసుపత్రిని డీసీహెచ్ రవికుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ వైద్యసిబ్బందితో మాట్లాడి రోగులకు అందుతున్న సేవలపై చర్చించారు. అలాగే సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

కూడేరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన వృద్ధుడు వెంకట నారాయణశెట్టి (75) గత నెల 15వ తేదీ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దీంతో మృతుడి భార్య నాగరత్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుత్తిరూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతాపల్లి గ్రామశివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం ఉప్పర్లపల్లికి చెందిన చైతన్య బైక్‌లో గుత్తికి వచ్చి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. బేతాపల్లి గ్రామాశివారులోకి రాగానే బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో చైతన్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని గుత్తి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై కేసు నమోదు

తాడిపత్రి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీహెచ్‌మహల్ థియేటర్ సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త నాగేశ్వరమ్మపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ సాయిప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఆమె జనన ధృవీకరణ పత్రం 10-06-1966 ఉండగా 10-8-1970వ తేదీ ఉన్నట్లు అంగన్‌వాడీ అధికారులకు అందజేశారని, వాటిపై కొందరు ఫిర్యాదు చేయగా.. ఉన్నతాధికారులు విచారించి తప్పుడు సర్టిఫికెట్ అందజేసినట్లు నిర్ధారించారని, ఈ అనంతరం ఆమెను సస్పెండ్ చేశారని అన్నారు.. సస్పెండ్‌తోపాటు కేసు నమోదు చేయాలని సీడీపీఓ సాజిదాబేగం పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారని, ఫిర్యాదు మేరకు అంగన్‌వాడీ కార్యకర్తపై కేసు నమోదుచేసినట్లు సీఐ చెప్పారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

బెళుగుప్ప, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల దినోత్సవంపై గురువారం నిర్వహించిన వ్యాసరచన పోటీలలో మండలకేంద్రంలోని శ్రీనివాసవిద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన హర్ష వర్దన్, వర్దన్, లావణ్యకు ఎస్ఐ శివ బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ సుమ, కరెస్పాండెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక

గుంతకల్లుటౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్ తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో విద్యార్థి విష్ణువర్థన్ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం నారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. ఇతను జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలుర విభాగం స్విమ్మింగ్ పోటీలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. అలాగే స్టాండ్‌బైగా టెన్త్ చదువుతున్న మరో విద్యార్థి బీ వంశీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈనెల 5నుంచి 7వ తేదీ వరకు పల్నాడు జిల్లా నరసారావు పేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఇరువురు విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్
- మహిళలకు ఉచిత సిలిండర్ల పంపిణీ



గుత్తిలో సిలిండర్‌ను అందజేస్తున్న వెంకటశివుడుయాదవ్

గుత్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని భారత్ గ్యాస్ గోదాము వద్ద శుక్రవారం ఆయన దీపం-2 పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్హులైన మహిళకు ఉచితంగా వంటగ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. సూపర్‌సిక్స్ పథకాల్లో ఒక్కొక్క పథకాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. మహిళల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకుడు గుమ్మనూరు నారాయణ, తహసీల్దార్ ఓబులేసు, మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మీయా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలకేంద్రంలోని వాసవీ కళ్యాణమండపంలో అర్హులకు ఉచిత సిలిండర్ల పంపిణీ జరిగింది. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ప్రసాద్, మండల ప్రత్యేకాధికారి షేక్ షఫీ, తహసీల్దార్ షర్మిల, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఎంఈఓ మల్లారెడ్డి, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు శ్రీధర్, ఎంపీపీ పుష్పవతి, సర్పంచ్ రాము పాల్గొన్నారు.

యల్లనూరు: మండలకేంద్రంలోని ధరణీగ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో దీపం-2 పథకాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు ఉచిత సిలిండర్లు అందజేశారు. టీడీపీ మండల కన్వీనర్ రామాంజనేయులు, క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్‌నాయుడు, ఇన్‌చార్జి తహసీల్దార్ శేషారెడ్డి, జంగంపల్లి సర్పంచు కుళ్లాయప్పనాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండల కేంద్రంలో టీడీపీ నాయకులు, అధికారులు కలిసి అర్హులకు ఉచిత సిలిండర్లు పంపిణీ చేశారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ రామకృష్ణ, ఎస్ఐ ఈశ్వరయ్య, టీడీపీ మండల కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌చార్జి కాలవ సన్నన్న, సర్పంచ్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

కణేకల్లు: మండలకేంద్రంలో దీపం-2 కార్యక్రమంలో భాగంగా అర్హులకు ఉచిత సిలిండర్లను పంపిణీ చేశారు. తహసీల్దార్ ఫణికుమార్, టీడీపీ మండల కన్వీనర్ లాలెప్ప, వీఆర్వో పవన్‌కుమార్, ఈఓ ప్రసాద్, సర్పంచ్ నిర్మల, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శెట్టూరు: మండలకేంద్రంలో అర్హులైన మహిళలకు గ్యాస్ సిలిండర్లను అందజేశారు. తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి, ఎంపీడీవో రఘురామ్ రావు, సిద్దలింగేశ్వర గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు లోకేష్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కుందుర్పి: మండలకేంద్రంలోని సహస్ర భారత్ గ్యాస్ కార్యాలయంలో దీపం-2 పథకాన్ని ప్రారంభించారు. ఇందులో తహసీల్దార్ శ్రీనివాసులు, టీడీపీ మండల కన్వీనర్ ధనుంజయ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని మండలపరిషత్ కార్యాలయంలో అర్హులైన మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, ప్రత్యేక అధికారి తిప్పేస్వామి, తహసీల్దార్ మునివేలు, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, సింగల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, ఈఓపీఆర్డీ దాస్ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి: పట్టణంలోని షాదీఖానాలో తహసీల్దార్ రజాక్‌వలి, మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లను పంపిణీచేశారు. వైస్‌చైర్మన్లు సరస్వతి, అబ్దుల్‌రహీం, కౌన్సిలర్లు, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు శ్రీకాంత్, ఓబులేసు పాల్గొన్నారు.

యాడికి: మండలకేంద్రంలోని సమావేశభవనంలో లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ జరిగింది. ఇందులో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, మండల ప్రత్యేక అధికారి రామాంజనేయులు, తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, జనసేన మండల కన్వీనర్ సునీల్‌కుమార్, బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా దీపావళి



గుంతకల్లులో హోమం నిర్వహిస్తున్న అర్చకులు



కూడేరులో జ్యోతులు ఊరేగిస్తున్న భక్తుడు

గుత్తిరూరల్/గుంతకల్లు టౌన్/బొమ్మనహాళ్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గుత్తి మండలవ్యాప్తంగా గురువారం దీపావళి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఉదయాన్నే ప్రజలు ఇళ్లల్లో లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూ జలు చేయించారు. తర్వాత ఇళ్ల ముంగిళ్లను దీపాలతో అలంకరించారు. పిల్లలు, పెద్దలు టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. గుంతకల్లు పట్టణంలోనూ దీపావళి వేడుకలను సంబరంగా జరుపుకున్నారు. ముఖ్యంగా మార్వాడీలు తమ తమ దుకాణాల్లో లక్ష్మీపూజ ఘనంగా చేశారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహాలక్ష్మి హోమాన్ని నిర్వహించారు. ఉదయం అర్చకులు అమ్మవారి మూలవిరాట్‌కు విశేషపుష్పాలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణంలో గణపతి, మహాలక్ష్మీ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. తర్వాత భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఇక బొమ్మనహాళ్ మండలవ్యాప్తంగా కూడా దీపావళి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు జరిపారు.

జ్యోతుల ఊరేగింపు

కూడేరు: దీపావళి పండుగను పురస్కరించుకుని మండల కేంద్రంలోని చౌడమ్మ, మారెమ్మ దేవతలకు జ్యోతుల ఊరేగింపు నిర్వహించారు. ప్రతి ఏడాది దీపావళికి గ్రామ దేవతలకు జ్యోతుల ఊరేగింపు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో బత్తల శివ అనే భక్తుడు జ్యోతులను నెత్తిన పెట్టుకుని ఊరేగింపు చేశాడు. భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

పండుగలా పింఛన్ల పంపిణీ



మిడుతూరులో పొలం వద్దకు వెళ్లి పింఛన్ అందిస్తున్న ఉద్యోగి

బెళుగుప్ప, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : మండలంలో శుక్రవారం ఉదయం నుంచి పింఛన్ల పంపిణీను పండుగలా కొనసాగింది. మండల వ్యాప్తంగా 5740 మంది లబ్ధిదారులు వుండగా 5398 మందికి మొదటి రోజునే పంపిణీ చేసినట్లు ఎంపీడీవో లక్ష్మీనారాయణ తెలిపారు. దీంతో మండలంలో 94.04 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందన్నారు.

పొలం వద్దకే వెళ్లి పంపిణీ

పెద్దవడుగూరు: మండలంలోని మిడుతూరు గ్రామంలో పింఛన్ లబ్ధిదారులు పలువురు వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్ద కు వెళ్లారు. అయితే శుక్రవారం గ్రామ రెవెన్యూ అధికారి అంజి, పంచాయతీ సెక్రెటరీ ఆంజనేయులు, టీడీపీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రమేష్‌యాదవ్ అక్కడికే వెళ్లి వారికి పింఛన్‌మొత్తాన్ని అందజేశారు.

పింఛన్ల పంపిణీ తనిఖీ

గుత్తి: పట్టణంలో చేపట్టిన పింఛన్ల పంపిణీని పలు వార్డులలో మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీమా తనిఖీ చేశారు. పింఛన్ల పంపిణీ వంద శాతం పూర్తిచేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబుబ్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఫర్టిలైజర్స్ సంఘం మండల కమిటీ ఎన్నిక



హేమనాథ్, అధ్యక్షుడు

బెళుగుప్ప, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఫర్టిలైజర్స్ సంఘం మండల అధ్యక్షుడిగా మండలకేంద్రానికి చెందిన హేమనాథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవాధ్యక్షుడు శివశంకర్ తెలిపారు. మండలకేంద్రంలో గురువారం మండలంలోని ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించి మండల కమిటీని ఎన్నుకున్నామన్నారు. ఉపాధ్యక్షుడిగా లాలూస్వామి, కార్యదర్శిగా గుండ్లపల్లి రాజశేఖర్, సహాయ కార్యదర్శిగా గంగవరం అనిల్‌కుమార్, కోశాధికారిగా బెళుగుప్ప ధనుంజయను, కమిటీ సభ్యులుగా రాము,అనిల్, ఎర్రిస్వామి, అరుణ్ కుమార్, శ్రావణ్‌కుమార్‌ను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం

తాడిపత్రి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీకట్ట వద్ద ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపక దినోత్సవాలను నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ హాజరై మాట్లాడారు. భారతదేశంలో మొదటి ట్రేడ్‌యూనియన్ ఏఐటీయూసీ అని తెలిపారు. స్వాతంత్ర్యం రాకమునుపు నుంచి ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రమణ, రవికుమార్, రాజు, రామకృష్ణ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి గురుతాత స్వామి ఉరుసు ఉత్సవాలు



గురుతాత స్వామి దర్గా

విడపనకల్లు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గురుతాత స్వామి 74వ ఉరుసు ఉత్సవాలు 8వ తేదీ నుంచి ప్రారంభం అవుతున్నట్లు దర్గా కమిటీ సభ్యులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 8వ తేదీన సాయంత్రం గంధం కార్యక్రమాన్ని సజ్జాద నషీన్ సయ్యద్‌షా గరీబ్‌పీర్ ఖాద్రీ ఇంటి నుంచి ఊరేగింపుగా దర్గాకు చేరుతుందన్నారు. 9వ తేదీన ఉరుసు నిర్వహిస్తారన్నారు. అదే రోజు రాత్రి 10 గంటల నుంచి ఖవ్వాలి ఉంటుందన్నారు. 10వ తేదీన తెల్లారు జామున 4 గంటల నుంచి స్వామి వారి షంషేర్‌ను గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించి ఉత్సవాలు ముగిస్తామని తెలిపారు. ఉరుసు ఉత్సవాలకు భక్తులు అధికంగా తరలిరావాలని వారు కోరారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక

బొమ్మనహాళ్/ ఉరవకొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందవాడ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం రాజసూర్యుడు, పీఈటీలు జనార్దన్, శివకుమార్ తెలిపారు. పాఠశాల ఆవరణలో సోమవారం వారు క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలలో 8,9 తరగతులు చదువుతున్న వంశీ, హెచ్‌బీ చిన్న ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు గుంటూరు జిల్లా కారంపూడిలో నిర్వహించే పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు తెలిపారు. అలాగే వజ్రకరూరు మండలం చిన్నహోతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు వీణ, అనిత భార్గవి కూడా రాష్ట్ర స్థాయి ఖో-ఖోపోటీలకు ఎంపికయ్యారు. వీరు కూడా కారంపూడిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ ప్రభాకర్ తెలిపారు.



ఖోఖో పోటీలకు ఎంపికైన గోవిందవాడ ఉన్నత పాఠశాల విద్యార్థులతో హెచ్‌ఎం, పీఈటీలు



రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన చిన్నహోతూరు ఉన్నత పాఠశాల విద్యార్థినులు

జాతీయస్థాయి ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక



జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన అఖిల

ఉరవకొండ: పట్టణంలోని జిల్లా పరిషత్ సెంట్రల్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని అఖిల స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో జరిగే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. గతనెల 5 నుంచి 7వతేదీ వరకూ గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె జిల్లా జట్టు తరపున పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 26 నుంచి 30వతేదీ వరకూ జమ్మూకాశ్మీర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొననున్నట్లు పీడీలు కిరణ్, మారుతి తెలిపారు.

రేపటి నుంచి డీఎస్సీ ఉచిత కోచింగ్ : ఎమ్మెల్యే కాలవ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం త్వరలో విడుదల చేయనున్న నేపథ్యంలో నియోజకవర్గంలో ఉన్న డీఎస్సీ అభ్యర్థుల కోసం ఉచిత కోచింగ్‌ను ఈ నెల 3వ తేదీ నుంచి పునఃప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేల రూపాయలు ఖర్చు పెట్టి సుదూర ప్రాంతాలకు వెళ్లి కోచింగ్ పొందలేని వారికి ఈ ఉచిత కోచింగ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటికే టెట్ పరీక్షల్లో విడుదలైన కీ ద్వారా చాలామంది అభ్యర్థులు కోచింగ్ నుంచి 20 శాతానికి పైగా మార్కులు పెంచుకోగలిగామని, దీనిని నుంచి డీఎస్సీలో వెయిటేజ్ పెరుగుతుందని ఆనందం వ్యక్తం చేశారన్నారు. అందుకే డిసెంబరు చివరి వరకు రెండు నెలల పాటు డీఎస్సీ ఉచిత కోచింగ్‌ను స్థానిక టెక్స్‌టైల్స్ పార్క్ వద్ద ఇవ్వనున్నట్లు చెప్పారు. ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిపుణులైన బోధకులతో శిక్షణ ఇప్పిస్తామన్నారు. శిక్షణ పొందే అభ్యర్థులకు మధ్యాహ్న భోజన వసతి కూడా కల్పించనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని డీఎస్సీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

టీడీపీ సభ్యత్వ నమోదు



గుత్తిలో సభ్యత్వ నమోదు చేస్తున్న టీడీపీ నాయకులు

గుత్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గుత్తిఆర్ఎస్‌లో శుక్రవారం టీడీపీ నాయకులు పార్టీ సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈసందర్భంగా నాయకుడు గుమ్మనూరు నారాయణ, పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరిమాట్లాడుతూ సభ్యత్వం చేసుకున్న ప్రతికార్యకర్తకు రూ.5 లక్షల ప్రమాదబీమాను పార్టీ అందిస్తుందని తెలిపారు. అలాగే కుటుంబానికి ఎంతో భరోసా కల్పిస్తుందని చెప్పారు. కనుక ప్రతిఒక్కరూ సభ్యత్వ నమోదు చేయించుకోవాలని సూచించారు. నాయకులు ప్రతాప్, చికెన్ శ్రీనివాసులు, రమేష్, రాజా, సోమశేఖర్, ప్రసాద్, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 12వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ వార్డు ఇన్చార్జి ఆమ్లెట్‌మస్తాన్‌యాదవ్ నిర్వహించారు. వార్డు ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీ సభ్యత్వ నమోదు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఐటీడీపీ కార్యకర్తలు రాజు, పునీత్, నాయకులు నారాయణ స్వామి, లక్ష్మయ్యయాదవ్, రుద్రమణి తదితరులు పాల్గొన్నారు.

నిందితుడి అరెస్టు



నిందితుడిని చూపుతున్న పోలీసులు

తాడిపత్రి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బంగారు గొలుసును చోరీ చేసిన కేసులో కడప జిల్లా లింగాల మండలం పెద్దకుడాల గ్రామానికి చెందిన మహేష్‌ను అరెస్టు చేశామని, అలాగే అతడి వద్ద నుంచి 3తులాల బంగారు గొలుసు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని సీపీఐ కాలనీలో వృద్ధురాలు రంగమ్మ ఒకటే ఉంటోంది. ఈ విషయాన్ని పసిగట్టిన మహేష్ సోదరుడు హరీష్‌తో కలిసి గత అక్టోబరు 15వ తేదీన ఆమె ఇంటిలోని చొరబడ్డారు. ఆ వృద్ధురాలి మెడలో నుంచి 3తులాల బంగారు గొలుసును అపహరించుకొని వెళ్లారు. కాగా గత గురువారం యల్లనూరురోడ్డు బైపాస్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంలో వస్తున్న మహేష్‌ను తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీలో చోరీకి గురైన మూడుతులాల బంగారు గొలుసును గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అనంతరం తమదైనశైలిలో విచారించగా చోరీ విషయం బయటపడిందన్నారు. తర్వాత మహేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని, హరీష్‌ను అరెస్ట్ చేయాల్సి ఉందని సీఐ పేర్కొన్నారు.

రాయదుర్గాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

రాయదుర్గం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాయదుర్గాన్ని కరువు మండలముగా ప్రకటించాలని సీపీఐ మండల కార్యదర్శి దుర్గప్ప కోరారు. ఈ మేరకు పట్టణంలో తహసీల్దార్ నాగరాజును శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. ఖరీఫ్ సీజన్‌లో పంట సాగు చేసి నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం ఇవ్వాలన్నారు. జిల్లాలో ఏడు మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మిగిలిన అన్ని మండలాలను కూడా కరువు కింద ప్రకటించాలని కోరారు. ముఖ్యంగా రాయదుర్గం మండలాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. నాయకులు మారెన్న, రుద్రప్ప, నాగరాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని సీపీఐ రైతు సంఘం నాయకులు తిప్పేస్వామి, నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో వలసకూలీలు అధికంగా ఉన్నారని, పంటలు చేతికందకుండా రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని వారు శుక్రవారం ప్రకటనలో డిమాండ్ చేశారు.

రోడ్డుకు మరమ్మతులు



రహదారికి మట్టి తోలిస్తున్న టీడీపీ నాయకులు

కణేకల్లు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి వేదావతి హగరి మీదుగా మాల్యంకు వెళ్లే రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు తెగిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో తెలుగుతమ్ముళ్లు శుక్రవారం సొంత నిధులతో ఆ రోడ్డుకు మట్టి తోలించి తాత్కాలిక మరమ్మతులు చేసి రాకపోకలను పునః ప్రారంభించారు. నాయకులు ఆనంద్‌రాజు, బీటీ రమేష్, చంద్రశేఖర్‌గుప్తా, ఈరప్ప తదితరులు మరమ్మతులు చేయించారు. ఈ రోడ్డు ఇప్పటికి ఐదో సారి తెగడం. తెగిన ప్రతిసారి ఆ నాయకులు మరమ్మతులు చేపట్టి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు.

ఘనంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ వేడుకలు

గుంతకల్లు టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అవతరణ వేడుకలను పట్టణంలో శుక్రవారం అవోపా సంఘం నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ సంఘం సభ్యులు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రం కోసం పొట్టిశ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో అవోపా సంఘం అధ్యక్షుడు పరచూరి చెన్నకేశవులు, కార్యదర్శి ధారా రాము, కోశాధికారి కోటారఘు, సభ్యులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ భవనంలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు, తెలుగుతల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ అసోషియేషన్ అధ్యక్షుడు అబుబకర్, సహాయ కార్యదర్శి కుళ్లాయి బాబు, కార్యదర్శి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో స్వాతీనక్షత్ర పూజలు

తాడిపత్రి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులతిప్పాయపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఓబులేసుకోనలో స్వామివారికి శుక్రవారం స్వాతీనక్షత్ర పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు వేకువజామునే స్వామి వారికి అభిషేకాలు, అలంకరణ లు చేసి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవిభూదేవి సమేత స్వామివారి ఉత్సవ మూర్తులకు కల్యాణం జరిపించారు. పెద్దఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని తీర్థ ప్రసాదాలు పొందారు.



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి